KR TV
మన క్రాంతి
ఇది వాస్తవ పత్రిక...




Published from Hyderabad, Nalgonda, Karimnagar, Warangal, Khammam, Vijayawada, Vishakhapatnam,Tirupati

సంపుటి : 01 సంచిక :57 | సోమవారం , 27 జనవరి 2025 | ఎడిటర్ : సందెపల్లి క్రాంతి కుమార్ | పేజీలు : 8 వెల: 3 రూ/-

## కర్తవ్యపథ్‌లో

# ఘనంగా 76వ గణతంత్ర వేడుకలు..

### - జెండా ఆవిష్కరించిన రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము

**న్యూఢిల్లీ ,26 జనవరి (క్రాంతిన్యూస్):** న్యూఢిల్లీలోని కర్తవ్యపథ్‌లో 76 గణతంత్ర దినోత్సవం సందర్భంగా రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము ఆదివారం (జనవరి 26) జాతీయ జెండాను ఆవిష్కరించారు. అనంతరం 105 ఎంఎం లైట్ ఫీల్డ్ గన్స్‌తో సైనిక బలగాల నుంచి గౌరవ వందనం స్వీకరించారు. ఈసారి రిపబ్లిక్ వేడుకలకు ఇండోనేసియా అధ్యక్షుడు ప్రబోవో సుబియాంతో ముఖ్య అతిథిగా హాజరయ్యారు. రాష్ట్రపతి ముర్ము, ఇండోనేషియా ప్రెసిడెంట్ సుబియాంటో ఇరువురూ 'సాంప్రదాయ బగ్గీ'లో రావడం విశేషం. ఈ పద్ధని 40 సంవత్సరాల తర్వాత 2024లో తిరిగి అనుసరించారు. వేడుకల్లో ప్రధాని నరేంద్ర మోదీ, ఉపరాష్ట్రపతి జగదీప్ ధన్‌ఖడ్, కేంద్ర మంత్రులు తదితరులు పాల్గొన్నారు.



## పరేడ్ గ్రౌండ్స్‌లో రిపబ్లిక్ డే వేడుకలు

### జాతీయ జెండా ఆవిష్కరించిన గవర్నర్

హైదరాబాద్,26జనవరి(క్రాంతిన్యూస్ ): దేశ వ్యాప్తంగా 76వ గణతంత్ర దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహిస్తున్నారు. పలువురు కేంద్ర మంత్రులు తమ కార్యాలయాలలో జాతీయ జెండా ఆవిష్కరించారు. తెలంగాణలోనూ రిపబ్లిక్ డే వేడుకలు ఘనంగా జరుగుతున్నాయి. సికింద్రాబాద్ పరేండ్ గ్రౌండ్స్ లో తెలంగాణ గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ జాతీయ జెండాను ఆవిష్కరించారు. అనంతరం ఆయన పోలీసుల గౌరవ వందనం స్వీకరించారు. ఈ కార్యక్రమంలో సీఎం రేవంత్ రెడ్డి, మంత్రులు, సీఎస్ శాంతికుమారి, డీజీపీ, ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## నాడు అందరికీ అన్నీ అని...

# నేడు కొందరికే కొన్ని

### మభ్యపెడుతున్న కాంగ్రెస్

### – కేటీఆర్



**హైదరాబాద్,,26 జనవరి(క్రాంతిన్యూస్):** తెలంగాణ ప్రభుత్వం ప్రారంభించిన నాలుగు సంక్షేమ పథకాలపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఎక్స్ వేదికగా ఫైర్‌య్యారు. మండలానికి ఒక పైలట్ గ్రామంలోనే వంద శాతం అమలు చేస్తామని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క కామెంట్స్‌పై కేటీఆర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. మండలానికి ఒక గ్రామంలోనే అమలు చేస్తామని మీ కాంగ్రెస్ మ్యానిఫెస్టో పంచారా? అని, మండలానికి ఒక విలేజ్‌లోని అని మీ గ్యారెంటీ కార్డులు ఇచ్చారా? అని, మండలానికి ఒక గ్రామంలోనే అని మీ ఎన్నికల ప్రచారం చేశారా? అని భట్టిని కేటీఆర్ ప్రశ్నించారు. మండలానికి ఒక గ్రామంలోనే ప్రజలను ఓట్లేయమని అడిగారా? అని, మండలానికి ఒక గ్రామంలోనే ఓట్లు వేస్తేకాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చారా? అని నిలదీశారు.

3లో

# తెలుగు రాష్ట్రాల్లో..

న్యూస్‌డెస్క్,26జనవరి (క్రాంతిన్యూస్):విజయవాడ మున్సిపల్ స్టేడియంలో గణతంత్ర వేడుకలు ఘనంగా జరిగాయి. గవర్నర్ అబ్దుల్ నజీర్ సైనికుల గౌరవ వందనం స్వీకరించి జాతీయజెండానుఆవిష్కరించారు. వేడుకలకు సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్, మంత్రి లోకేశ్ హాజరయ్యారు గణతంత్ర వేడుకల సందర్భంగా తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి జూబిలీహిల్స్‌లోని తన నివాసంలో జాతీయజెండాను ఆవిష్కరించారు. అంబేద్కర్ స్ఫూర్తితో రాజ్యాంగ పరిరక్షణకు కలిసికట్టుగా సాగుదామని పిలుపునిచ్చారు.



2లో

## తెలుగు రాష్ట్రాల్లో ఆహ్లాదకరంగా'ఎట్ హోం'

### - హాజరైన సీఎంలు, అధికారులు

గణతంత్ర దినోత్సవం సందర్భంగా తెలుగు రాష్ట్రాల్లోని రాజ్ భవన్‌లో 'ఎట్ హోం' కార్యక్రమం ఘనంగా సాగింది. ఆదివారం సాయంత్రం విజయవాడలోని రాజ్ భవన్‌లో గవర్నర్ జస్టిస్ అబ్దుల్ నజీర్ తేనీటి విందు ఇచ్చారు. ఈ కార్యక్రమానికి సీఎం చంద్రబాబు, ఆయన సతీమణి భువనేశ్వరి, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ సహా పలువురు ప్రముఖులు హాజరయ్యారు.



## మహిళ ఇంటి ముందు బ్యాంక్ అధికారుల వినూత్న నిరసన

### వంటావార్పుతో అంతా షాక్



3లో

## మంత్రి పొంగులేటి పర్యటనలో

# ఉద్రిక్తత

### : పోలీసుల లాఠీఛార్జ్..



3లో

జనగామ జిల్లాలో ఉద్రిక్తత చోటు చేసుకుంది.. మంత్రి పొంగులేటి పర్యటన సందర్భంగా ఏర్పాటు చేసిన సభ దగ్గరకు బీఆర్ఎస్ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి రావడంతో టెన్షన్ నెలకొంది. సభకు రాకుండా అక్రమంగా అరెస్ట్ చేసిన బీఆర్ఎస్ పార్టీ నాయకులను సభకు అనుమతించాలని డీసీపీ రాజ మహేంద్ర నాయక్ ను కోరారు ఎమ్మెల్యే పల్లా. ఈ క్రమంలో జై కాంగ్రెస్, పల్లా గో బ్యాక్ అంటూ నినాదాలు చేశారు కాంగ్రెస్ కార్యకర్తలు.

కాంగ్రెస్ కార్యకర్తలకు పోటీగా జై పల్లా అంటూ పోటాపోటిగా నినాదాలు చేశారు బీఆర్ఎస్ కార్యకర్తలు. దీంతో ఇరు వర్గాల మధ్య మాటల యుద్ధం మొదలైంది. ఈ క్రమంలో అక్కడే ఉన్న పోలీసులు ఇరు వర్గాలను చేదరగొడుతూ నచ్చజెప్పే ప్రయత్నం చేసినప్పటికీ పరిస్థితి కంట్రోల్ అవ్వకపోవడంతో లాఠీచార్జ్ చేశారు.

### ప్రశ్నిస్తే రక్తాలు వచ్చేలా విరుచుకుపడతారా..

**జనగామ లాఠీచార్జ్‌పై హరీశ్‌రావు సీరియస్**

జనగామ జిల్లా ఎర్రగుంట తండాలో జరిగిన లాఠీచార్జ్‌ను మాజీ మంత్రి, బీఆర్ఎస్ నేత హరీశ్‌రావు తీవ్రంగా ఖండించారు. లాఠీలు విరిగేలా, రక్తాలు వచ్చేలా పోలీసులు విరుచుకుపడటం దారుణమని మండిపడ్డారు.

- భూమికి, విత్తనానికి ఎలాంటి అనుబంధం ఉంటుందో.. రైతుకు కాంగ్రెస్ పార్టీకి అంతంటి అనుబంధం
- చంద్రవంచలో ఆదివారం 4 పథకాలను ప్రారంభించిన రేవంత్
- కొడంగల్‌కు జరగాల్సిన స్థాయిలో న్యాయం జరగలేదు
- దేశమంతటా రైతులకు కాంగ్రెస్ ప్రభుత్వం రుణమాఫీ చేసింది
- గత ప్రభుత్వం రేషన్‌కార్డులు ఇవ్వలేదు
- కూలీ పనిచేసే పేదలకు రైతుభరోసా కింద రూ.12 వేలు ఇస్తున్నాం
- రాష్ట్రాన్ని చుట్టుముట్టిన సమస్యలను ఒక్కొక్కటిగా పరిష్కరిస్తున్నాం
- ఇచ్చిన గ్యారంటీలను అమలుచేస్తున్నాం
- కాళేశ్వరం మూడేళ్లకే కూలింది

## కాంగ్రెస్ పార్టీ మాట ఇస్తే..

# ఎప్పటికీ వెనక్కి తగ్గదు

### - సీఎం రేవంత్‌రెడ్డి

**హైదరాబాద్,26జనవరి(క్రాంతిన్యూస్):** రైతుల సంక్షేమం కోసం కాంగ్రెస్ ప్రభుత్వం ఎంతో కృషి చేస్తుందని సీఎం రేవంత్‌రెడ్డి తెలిపారు. ఏళ్ల తరబడి ఎన్నో పథకాలను అన్నదాతల కోసం కాంగ్రెస్ అమలు చేసిందని అన్నారు. భూమికి, విత్తనానికి ఎలాంటి అనుబంధం ఉంటుందో.. అదే స్థాయిలో రైతుకు కాంగ్రెస్ పార్టీకి అంతంటి అనుబంధం ఉందని తెలిపారు. నేడు నాలుగు సంక్షేమ పథకాలను రాష్ట్రానికి కొడంగల్ నుంచి అంకితం చేస్తున్నామన్నారు. ప్రతీ నియోజకవర్గంలో 3,500 ఇళ్లు .. రైతు భరోసా, రేషన్ కార్డులు మార్చ్ 31 దాకా రాష్ట్రంలోని ప్రతీ లబ్ధిదారుడికి అందజేస్తామని సీఎం రేవంత్‌రెడ్డి స్పష్టం చేశారు.



2లో

## విడతల వారీగా 'ఈ కుబేర్' పద్ధతిలో రైతు భరోసా

ఎన్నికల్లో ఇచ్చిన ఆరు గ్యారెంటీలను కాంగ్రెస్ ప్రభుత్వం ఒక్కొక్కటిగా అమలు చేస్తోంది. ఇందులో భాగంగానే నారాయణపేట జిల్లా కోస్గి మండలం చంద్రవంచలో ఆదివారం 4 పథకాలను సీఎం రేవంత్‌రెడ్డి ప్రారంభించారు. రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, ఇందిరమ్మ ఇళ్లు, రేషన్ కార్డుల పంపిణీని ప్రారంభించారు.

## డబ్బుల కోసమే వ్యాపారి హత్య



3లో

# తడి బట్టలతో

### ఇద్దరం కురుమూర్తి దేవాలయానికి పోదాం..వస్తావా?

### రేవంత్‌కి మాజీ మంత్రి హరీష్‌రావు సవాల్



3లో

**గజ్వేల్,26జనవరి(క్రాంతిన్యూస్):** మహబూబ్‌నగర్ జిల్లాలోని పెండింగ్ ప్రాజెక్టులను గత బీఆర్ఎస్ ప్రభుత్వం పట్టించుకోలేదని సీఎం రేవంత్ రెడ్డి అబద్దాలు మాట్లాడుతున్నారని బీఆర్ఎస్ ఎమ్మెల్యే, మాజీ మంత్రి హరీష్ రావు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇది నిజమో.. కాదో తెలుసుకొనేందుకు తడి బట్టలతో ఇద్దరం కురుమూర్తి దేవాలయానికి పోదాం.. వస్తావా? అంటూ సీఎం రేవంత్ రెడ్డికి ఎమ్మెల్యే హరీష్ రావు బహిరంగ సవాల్ విసిరారు. ఆదివారం గజ్వేల్‌లో హరీష్ రావు మాట్లాడుతూ.. 20 ఏళ్లలో కాంగ్రెస్, టీడీపీలు కల్వకుర్తి, నెట్టంపాడు, కోయిల్ సాగర్ ప్రాజెక్టులను పెండింగ్‌లో పెట్టి 26 వేల ఎకరాలకే నీళ్లిచ్చారని గుర్తు చేశారు. కానీ సీఎం కేసీఆర్ కేబినెట్‌లో నీటి పారుదల శాఖ మంత్రిగా తాను బాధ్యతలు చేపట్టి.. మహబూబ్ నగర్ జిల్లాలోని ప్రాజెక్టుల వద్దే నిద్ర పోయి.. కష్టపడి 6 లక్షలకుపైగా ఎకరాలకు నీళ్లి ఇచ్చామన్నారు. మహబూబ్‌నగర్ జిల్లాకు అన్యాయం చేసింది తెలుగుదేశం, కాంగ్రెస్ పార్టీలని ఈ సందర్భంగా ఆయన ఆరోపించారు.

## సొంత జిల్లాలో డిప్యూటీ సీఎం భట్టికి


# భారీ షాక్



3లో

## నేటిమాట

**మనకు లభించే చిన్న అవకాశాలే భవిష్యత్తులో ఉన్నత శిఖరాల్ని చేరుస్తాయి**



-బెంజమిన్ ఫ్రాంక్లిన్

## ముదిరిన పటాన్‌చెరు

# కాంగ్రెస్ లొల్లి



3లో

**పటాన్‌చెరు,26జనవరి(క్రాంతిన్యూస్):** పటాన్‌చెరు నియోజకవర్గంలో కాంగ్రెస్ గ్రూపు తగదాలపై పీసీసీ కమిటీ విచారణ ప్రారంభించింది. ఇప్పటికే పటాన్‌చెరులోని కాంగ్రెస్ పార్టీలో కొత్త , పాత గోడవలపై పీసీసీ ఓ కమిటీ వేసిన విషయం తెలిసిందే. అమీన్ పూర్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయానికి ఆదివారం నాడు కమిటీ సభ్యుడు , ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ , జిల్లా అధ్యక్షురాలు నిర్మల జగ్గారెడ్డి వచ్చారు. కాట శ్రీనివాస్ గౌడ్‌తో కమిటీ సభ్యులు, నీలం మధు భేటీ అయ్యారు.

## వంటగదిలో ఎలుకలు, బొద్దింకలు..

### శ్రీచైతన్య విద్యా సంస్థల సెంట్రల్ కిచెన్ లైసెన్స్ రద్దు



3లో

క్రాంతి KR TV

సోమవారం 27 జనవరి 2025

# కర్తవ్యపథ్‌లో ఘనంగా 76వ గణతంత్ర వేడుకలు..

## జెండా ఆవిష్కరించిన రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము

మొదటి పేజీ తరువాయి

న్యూఢిల్లీ ,26 జనవరి(క్రాంతిన్యూస్ ): కర్తవ్య పథంలో జరిగిన కవాతును దేశంలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన సంగీత వాయిద్యాలతో కూడిన 300 మంది సాంస్కృతిక కళాకారుల బృందం 'సారే జహాన్ సే అచ్చా' వాయించారు. ఇక నేటి రిపబ్లిక్ వేడుకల్లో బ్రహ్మోస్, ఆకాశ్ క్షిపణులు, పినాక మల్టీబ్యారెల్ రాకెట్ ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. కర్తవ్య పథ్‌పై హెలికాప్టర్లు పూల వర్షం కురిపించాయి. రాష్ట్రపతి భవన్ నుంచి ఎర్రకోట వరకు దాదాపు 9 కిలోమీటర్ల మేర రిపబ్లిక్ డే పరేడ్ నిర్వహించారు. దేశ వ్యాప్తంగా పలు రాష్ట్రాలకు చెందిన 31 శకటాలను ఇందులో ప్రదర్శించారు. వేడుకల్లో మొట్టమొదటిసారిగా, ట్రై-సర్వీసెస్ టేబుల్‌లో సాయుధ బలగాల మధ్య ఉమ్మడి, ఏకీకరణ స్ఫూర్తిని చూపేలా 'శశక్త్ ఔర్ సురక్షిత్ భారత్' థీమ్‌తో త్రివిధ దళాల మధ్య నెట్‌వర్కింగ్, కమ్యూనికేషన్‌ను సులభతరం చేసే జాయింట్ ఆపరేషన్స్ రూమ్‌ను ప్రదర్శించనున్నారు. ప్రతి సంవత్సరం జనవరి 29న విజయ్ చౌక్‌లో జరిగే ' బీటింగ్ రిట్రీట్ సెర్మనీ'తో గణతంత్ర దినోత్సవ వేడుకలు ముగుస్తాయి. ఈ ఏడాది కూడా ఈ సంప్రదాయాన్ని కొనసాగించనున్నారు.

### ముఖ్య అతిథి

ఈ వేడుకలకు ఇండోనేషియా అధ్యక్షుడు ప్రబోవో సుబియాంటో ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఎప్పటిలాగే గణతంత్ర దినోత్సవ వేడుకల్లో నిర్వహించిన పరేడ్ ప్రధాన ఆకర్షణగా నిలిచింది. ఈ పరేడ్‌లో ప్రదర్శించిన వివిధ రాష్ట్రాల శకటాలు అందర్నీ ఆకట్టుకున్నాయి. అయితే ఆంధ్రప్రదేశ్‌కు సంబంధించిన ఏటికొప్పాక బొమ్మల శకటం మాత్రం ఈ పరేడ్‌లో ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. సాధారణ కర్రతో తయారు చేసే ఈ ఏటికొప్పాక బొమ్మలు.. ఆంధ్రప్రదేశ్ కీర్తిని విశ్వవ్యాప్తం చేసిన సంగతి అందరికి తెలిసిందే.

ఈ బొమ్మలను చూసి దేశ ప్రధాని నరేంద్ర మోదీ సైతం పులకించారు. ఇక టీ-90 భీష్మ ట్యాంక్, బ్రహ్మోస్ క్షిపణి వంటి అత్యాధునిక సైనిక హార్డ్‌వేర్‌లతో పాటు స్వదేశీ తయారీ యుద్ధ ట్యాంకులు, విమానాలను సైతం ఈ పరేడ్‌లో ప్రదర్శించారు. అలాగే ఈ వేడుకల సందర్భంగా ఎంఐ 17 వీ 5 హెలికాప్టర్లను ప్రదర్శించారు. 129 హెలికాప్టర్ యూనిట్‌కు చెందిన ఈ హెలికాప్టర్లు కర్తవ్యపథ్ మీదుగా జెండాలతో విహరించి.. అందరిని ఆకట్టుకొన్నాయి.

ఇక ఈ ఏడాది 'స్వర్ణిమ్ భారత్: విరాసత్ ఔర్ వికాస్' (సువర్ణ భారతం: వారసత్వం, అభివృద్ధి) థీమ్‌తో రిపబ్లిక్ డే పరేడ్‌ను నిర్వహించారు. ఈ పరేడ్‌లో మొత్తం 31 శకటాలు, 18 మార్చింగ్ కంటింజెంట్లు, 15 బ్యాండ్లు పాల్గొన్నాయి. ఇవి కాకుండా అదనంగా దాదాపు 5 వేల మంది కళాకారులు 45 నృత్యరీతులతో సాంస్కృతిక ప్రదర్శనలు ఇచ్చారు. ఇండోనేషియాకు చెందిన 152 మంది సాయుధ దళాల సభ్యులు ఈ ప్రత్యేక కవాతులో పాల్గొన్నారు.

సీఆర్‌పీఎఫ్‌కు చెందిన 148 మంది మహిళా కవాతు బృందం ఈ రిపబ్లిక్ వేడుకల్లో ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. జనవరి 29వ తేదీన విజయ్ చౌక్‌లో నిర్వహించే బీటింగ్ రిట్రీట్ కార్యక్రమంతో ఈ రిపబ్లిక్ వేడుకలు ముగియనున్నాయి. ఇక ఈ రిపబ్లిక్ డే వేడుకలను వీక్షించేందుకు దాదాపు 10 వేల మంది ప్రత్యేక అతిథులు హాజరయ్యారు. యాంటీ డ్రోన్ వ్యవస్థలు, ఆర్మీ హెలికాప్టర్లు, భద్రతా సిబ్బంది ఈ పరేడ్‌ను డేగ కన్నుతో గస్తీని నిర్వహించాయి.

### అందరి చూపు ప్రధాని తలపాగా మీదే.!

76వ గణతంత్ర దినోత్సవం సందర్భంగా ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఆదివారం తెల్లటి కుర్తా-పైజామా, ముదురు గోధుమ రంగు క్లోజ్డ్ నెక్ కోటు, ఎరుపు పసుపు రంగు తలపాగా ధరించారు. అంతకు ముందు, 75వ గణతంత్ర దినోత్సవం సందర్భంగా ప్రధాని మోదీ బహుళ వర్ణ 'బంధాని' ప్రింట్ తలపాగాను ధరించారు. బంధానీ అనేది ఒక రకమైన టై-డై ఫ్యాబ్రిక్, ఇది గుజరాత్, రాజస్థాన్‌లలో ప్రసిద్ధి చెందింది. ఇది వస్త్రాన్ని కట్టి, ముడి వేసి తర్వాత రంగు వేస్తారు. జార్జెట్, షిఫాన్, సిల్క్, కాటన్ బట్టలను కలర్ పూల్‌లో ఉంచే ముందు ఒక దారంతో గట్టిగా కట్టి, ఈ దారాన్ని తెరిచినప్పుడు, కట్టిన భాగం రంగులోకి మారుతుంది. తరువాత దారం ఉపయోగించి చేతితో వస్త్రంపై డిజైన్ తయారు చేస్తారు.

### ప్రతిసారీ ఓ ప్రత్యేకత

స్వాతంత్ర్య దినోత్సవం, గణతంత్ర దినోత్సవాలకు ప్రధానమంత్రి రాజస్థానీ సఫా లేదా తలపాగాను సెలక్ట్ చేసుకుంటారు. 75వ గణతంత్ర దినోత్సవం సందర్భంగా ప్రధాని మోదీ బహుళ వర్ణ 'బంధానీ' ప్రింట్ తలపాగా ధరించారు. 2023లో మోదీ కుర్తా, చుడీదార్ పైజామాతో పాటు బహుళ వర్ణ రాజస్థానీ తలపాగా ధరించారు. 2022లో గణతంత్ర దినోత్సవ వేడుకల కోసం మోదీ ఉత్తరాఖండ్ నుంచి ఒక ప్రత్యేకమైన సాంప్రదాయ టోపీని ఎంచుకున్నారు. 2021లో గణతంత్ర దినోత్సవ పరేడ్ సందర్భంగా ఆయన పసుపు చుక్కలు ఉన్న 'హలారి' తలపాగాను ధరించారు. దీనిని జామ్‌నగర్ రాజ కుటుంబానికి చెందిన జామ్ సాహెబ్ ప్రధాన మంత్రికి బహూకరించారు.

# కాంగ్రెస్ పార్టీ మాట ఇస్తే.. ఎప్పటికీ వెనక్కి తగ్గదు - సీఎం రేవంత్‌రెడ్డి

మొదటి పేజీ తరువాయి

హైదరాబాద్,26జనవరి(క్రాంతిన్యూస్):

### కొడంగల్‌కు న్యాయం జరగలేదు..

నారాయణపేట జిల్లా కోస్గి మండలం చంద్రవంచలో ఆదివారం 4 పథకాలను సీఎం రేవంత్ ప్రారంభించారు. రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, ఇందిరమ్మ ఇళ్లు, రేషన్ కార్డుల పంపిణీని ప్రారంభించారు. లబ్ధిదారులకు చెక్కులను సీఎం రేవంత్‌రెడ్డి అందజేశారు. రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా చెక్కులను, ఇందిరమ్మ ఇళ్ల ప్రొసీడింగ్స్‌ను కొత్త రేషన్ కార్డులు లబ్ధిదారులకు సీఎం రేవంత్ రెడ్డి అందజేశారు. ఈ నాలుగు సంక్షేమ పథకాలను ఇక్కడి నుంచి ప్రారంభించడం ఆనందంగా ఉందన్నారు. ప్రభుత్వ సంకల్పంలో భాగంగా ఈ పథకాలను చంద్రవంచ నుంచి ప్రారంభించినట్లు తెలిపారు. స్వాతంత్రం వచ్చిన నాటి నుంచి 2023 దాకా కొడంగల్‌కు జరగాల్సిన స్థాయిలో న్యాయం జరగలేదన్నారు. ఇక్కడి ప్రజల ఆశీర్వాదంతో తాను సీఎం అయ్యానని.. తాను ఇప్పుడు సమయం కేటాయించ లేకపోయినా.. కొడంగల్‌ను అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తానని హామీ ఇచ్చారు.

### రుణమాఫీ చేశాం..

దేశమంతటా రైతులకు కాంగ్రెస్ ప్రభుత్వం రుణమాఫీ చేసిందని చెప్పారు. ప్రధాని మన్మోహన్‌సింగ్ ఒక్క సంతకంతో దేశమంతా రుణమాఫీ చేశారని గుర్తుచేశారు. రైతులకు ఒకే విడతలో రూ.2లక్షల వరకు రుణమాఫీ చేశామన్నారు. సాగు ఖర్చులు పెరిగాయని రైతు భరోసా నిధులు పెంచామన్నారు. ఏడాదికి ఎకరాకు రూ.12వేలు చొప్పున రైతు భరోసా ఇస్తున్నామని తెలిపారు. ఇవాళ ఆదివారం కాబట్టి రైతుభరోసా డబ్బులు జమకావు అని చెప్పారు. అర్ధరాత్రి 12 దాటగానే రైతుల ఖాతాల్లో డబ్బులు జమ అవుతాయని సీఎం రేవంత్‌రెడ్డి స్పష్టం చేశారు. భూమిలేని వారిని కూడా ఆదుకోవాలని గతంలో కూలీలు అడిగారని గుర్తుచేశారు

### గత ప్రభుత్వం రేషన్‌కార్డులు ఇవ్వలేదు

భూమిలేని పేదలను ఆదుకునేందుకు రైతుభరోసా తీసుకువచ్చామన్నారు. కూలీ పనిచేసే పేదలకు రైతుభరోసా కింద రూ.12 వేలు ఇస్తున్నామని అన్నారు. గత పదేళ్లలో పేదలకు ప్రభుత్వ ఇళ్లు రాలేదని చెప్పుకొచ్చారు. గత పదేళ్లలో గ్రామాల్లో ఎవరికైనా డబుల్‌బెడ్‌రూం ఇళ్లు వచ్చాయా? అని ప్రశ్నించారు. పేదలు ఇల్లు నిర్మించుకుంటే రూ.5లక్షల ఆర్థిక సాయం చేస్తున్నామని సీఎం రేవంత్‌రెడ్డి తెలిపారు. గత ప్రభుత్వం పదేళ్లపాటు రేషన్‌కార్డులు ఇవ్వలేదని మండిపడ్డారు. రేషన్‌కార్డు ఉన్న పేదలకు త్వరలోనే సన్న బియ్యం ఇస్తామని హామీ ఇచ్చారు. గ్రామ సభల ద్వారా రేషన్‌కార్డులకు దరఖాస్తులు స్వీకరించామని తెలిపారు. గ్రామ సభల ద్వారా గ్రామాలకు అధికారులను పంపిస్తున్నామన్నారు. గతంలో ఏదైనా కావాలంటే ఎవరైనా ఫాంహౌస్‌కు వెళ్లాల్సిన పరిస్థితి ఉండేదన్నారు. ఇప్పుడు ప్రజల దగ్గరకే ఎమ్మెల్యేలు, అధికారులు వస్తున్నారని తెలిపారు. గ్రామాల్లో ప్రజల సమక్షంలోనే లబ్ధిదారుల ఎంపిక జరిగిందని అన్నారు. ప్రభుత్వమే ప్రజల దగ్గరకు వచ్చి దరఖాస్తులు తీసుకుంటోందని చెప్పారు.

### నిరంతరం కృషి చేస్తాం..

"ప్రజల ఆకాంక్షలు నెరవేర్చడానికి నిరంతరం కృషి. రాష్ట్రాన్ని చుట్టుముట్టిన సమస్యలను ఒక్కొక్కటిగా పరిష్కరిస్తున్నాం. ఇచ్చిన గ్యారంటీలను అమలుచేస్తూ ముందుకు వెళ్తున్నాం. ఎంతోమంది పేదలు కొత్త రేషన్‌కార్డులు కోసం ఎదురుచూపులు. రైతు కూలీలు ప్రభుత్వ అండ కోరుకుంటున్నారు. రైతు భరోసాతో ఏడాదికి రూ.12 వేలు ఇస్తున్నాం. పదేళ్ల తర్వాత ఇందిరమ్మ ఇండ్ల కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్నాం. రైతులతో కాంగ్రెస్ ప్రభుత్వానిది విడదీయరాని అనుబంధం. రైతులకు ఉచిత విద్యుత్ పథకాన్ని మొదలుపెట్టింది కాంగ్రెస్సే. 2024 ఆగస్టు 15న రూ.21వేల కోట్లతో రైతు రుణమాఫీ చేశాం. 25.50 లక్షల మంది రైతుల ఖాతాల్లో రూ.21వేల కోట్లు జమ. ప్రభుత్వం వచ్చిన తొలి ఏడాదిలోనే 55,147 ఉద్యోగాలు ఇచ్చాం" అని సీఎం రేవంత్‌రెడ్డి తెలిపారు.

### కాళేశ్వరం మూడేళ్లకే కూలింది..

"ప్రజా ప్రభుత్వం ప్రజలకు జవాబుదారీగా ఉంటుంది. కాంగ్రెస్ పార్టీ మాట ఇస్తే.. ఎప్పటికీ వెనక్కి తగ్గదు. తెలంగాణ ఇస్తామని సోనియా గాంధీ చెప్పారు. పదేళ్ల అధికారంలో ఉండి.. పాలమూరు ప్రాజెక్టులు పూర్తిచేయలేదు. రూ.లక్ష కోట్లు పెట్టి కట్టిన కాళేశ్వరం మూడేళ్లకే కూలింది. కాళేశ్వరం కూలిపోయినా.. ఈ ఏడాది సాగు విస్తీర్ణం పెరిగింది. ప్రతిపక్ష నేత సభకు రాని దుస్థితిని ఏమనాలి. ప్రతిపక్ష నేతగా బాధ్యత నిర్వర్తించినప్పుడు ఆ పదవి ఎందుకు. మనం ఎన్నుకున్న సర్పంచ్ గ్రామంలో లేకుంటే ఎలా ఉంటుంది. ప్రాజెక్టుల కోసం భూ సేకరణ చేస్తే ప్రజలను రెచ్చగొడుతున్నారు. మన ప్రజలకు ఉపాధి కోసం పరిశ్రమలు తేవాలని భావించా. మాయమాటలు చెప్పి ప్రజలను రెచ్చగొట్టి పరిశ్రమలు అడ్డుకున్నారు. నా సోదరుడు ప్రజా సేవ చేస్తుంటే.. ఏం పదవి ఉందని అంటున్నారు. కేసీఆర్ కుటుంబం వల్లే మా ఇంట్లో అందరూ పదవులు పొందలేదు. సోదరులు, బంధువులు అందరికీ పదవులు ఇస్తేనే.. మంచిదా? కుటుంబం అంతటికీ పదవులు ఇచ్చి దోపిడీ చేసే వ్యక్తిని కాదు. కేసీఆర్ తన కుటుంబానికి, బంధువులకు పదవులు ఇచ్చారు. కేసీఆర్ కుమార్తె ఎన్నికల్లో ఓడిపోతే వెంటనే ఎమ్మెల్సీ చేశారు. పేదలంతా ఎక్కడ ఉన్నా.. రేషన్‌కార్డు తీసుకోవాలి" అని సీఎం రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు.

# పరేడ్ గ్రౌండ్స్‌లో రిపబ్లిక్ డే వేడుకలు

## జాతీయ జెండా ఆవిష్కరించిన గవర్నర్

మొదటి పేజీ తరువాయి

హైదరాబాద్,26జనవరి(క్రాంతిన్యూస్): తెలంగాణ మానవ హక్కుల కమిషన్‌లో గణతంత్ర దినోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. 76వ గణతంత్ర దినోత్సవాన్ని తెలంగాణ మానవ హక్కుల కమిషన్ ప్రాంగణంలో ఘనంగా నిర్వహించారు. కార్యదర్శి మొహమ్మద్ షహాబుద్దీన్ మువ్వన్నెల జెండాను ఆవిష్కరించారు.

### హైదరాబాద్ పోలీసుల రిపబ్లిక్ డే వేడుకలు

బంజారాహిల్స్ రోడ్ నెం.12లోని హైదరాబాద్ సిటీ పోలీసు కమిషనర్ కార్యాలయము, ఐసిసిసి భవనంలో 76వ గణతంత్ర దినోత్సవం వేడుకలు ఘనంగా జరుపుకున్నారు. పరిమళ హానా నూతన్ ఐపిఎస్ జాయింట్ సిపి (అడ్మిషన్) హైదరాబాద్ జాతీయ జెండాను ఆవిష్కరించారు. తరువాత అందరు కలసి జాతీయ గీతాలాపన చేశారు. గణతంత్ర దినోత్సవ వేడుకలను పురస్కరించుకొని పరిమళ హానా నూతన్ ఐపిఎస్ జాయింట్ సిపి (అడ్మిన్) మాట్లాడుతూ "జనవరి 26, 1950 నాడు భారత రాజ్యాంగం అమలులోనికి వచ్చింది. కనుక మనం ప్రతి సంవత్సరం ఈ రోజున గణతంత్ర దినోత్సవంగా నిర్వహించుకుంటాం అన్నారు.

పోలీసు వ్యవస్థలోని ప్రతి ఒక్కరూ రాజ్యాంగ స్ఫూర్తి ప్రకారం ప్రజాస్వామిక పద్ధతిలో ప్రజాసేవ చేస్తారు. మనమంతా కలసి కట్టుగా పని చేస్తేనే ప్రజలకు మంచి సేవలందిస్తామని చెప్పారు. పోలీసు కమిషనర్ కార్యాలయ సిబ్బంది అందరికి గణతంత్ర దినోత్సవం శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో K . పుష్పా రెడ్డి IPS DCP ICCC, K. రవీందర్ రెడ్డి Addl DCP ICCC, M.నర్సింగ్ రావు DSP ICCC, R.గంగారం DSP ICCC, సతీశ్ పిఎస్ టు సిపి హైదరాబాదు, కె.వెంకటేశ్వర్ రెడ్డి, అకౌంట్స్ ఆఫీసర్, శ్రీదేవి ADO, విజయభాస్కర్ రెడ్డి, ఏసీపీ, ఐసీసీసీ, ఎం.సత్యానారాయణ డీఎస్పీ కమ్యూనికేషన్స్, ఉమాకాంత్ జేఏఓ, ట్రాఫిక్ ఈ-చలాన్ ఇన్‌స్పెక్టర్లు, ఎస్‌ఐలు, సిబ్బంది, కమాండ్ కంట్రోల్ సెంటర్ అధికారులు, కమ్యూనికేషన్ మరియు మినిస్టీరియల్ సిబ్బంది పాల్గొన్నారు.





# తెలుగు రాష్ట్రాల్లో..

మొదటి పేజీ తరువాయి

న్యూస్ డెస్క్ ,26 జనవరి ( క్రాంతి న్యూస్ ): తెలంగాణ అసెంబ్లీలో గణతంత్ర వేడుకలు ఘనంగా నిర్వహించారు. శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్ పోలీసులు గౌరవ వందనం స్వీకరించి జాతీయజెండాను ఆవిష్కరించారు. అంతకు ముందు రాజ్యాంగ నిర్మాత అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

గణతంత్ర దినోత్సవం సందర్భంగా తెలంగాణ శాసన మండలి ప్రాంగణంలో జాతీయ జెండా ఆవిష్కరించారు చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి. అనంతరం పోలీసుల నుంచి గౌరవవందనం స్వీకరించారు. ఆయన వెంట పలువురు ఎమ్మెల్సీలు, ఉన్నతాధికారులు ఉన్నారు.

ఏపీ సచివాలయంలో గణతంత్ర వేడుకలు ఘనంగా నిర్వహించారు. చీఫ్ సెక్రటరీ విజయానంద్ సైనికుల గౌరవ వందనం స్వీకరించి జాతీయజెండాను ఆవిష్కరించారు. ఈ వేడుకలకు స్పీకర్ అయ్యన్నపాత్రుడు ముఖ్య అతిథిగా హాజరయ్యారు.

గణతంత్ర దినోత్సవం సందర్భంగా విశాఖలో జాతీయ జెండాను ఆవిష్కరించారు ఏపీ హోంమంత్రి అనిత. తన క్యాంపు కార్యాలయంలో అంబేద్కర్ చిత్రపటం దగ్గర పూలు చల్లి నివాళులర్పించారు. అంబేద్కర్ స్ఫూర్తితో ముందుకు సాగుదామని పిలుపునిచ్చారు.

తెలంగాణ మంత్రి సీతక్క ములుగులోని తన క్యాంపు ఆఫీసులో జాతీయ జెండాను ఆవిష్కరించారు. పోలీసులు గౌరవ వందనం స్వీకరించి రాజ్యాంగం గొప్పదనాన్ని చాటిచెప్పారు. రాజ్యాంగం కల్పించిన హక్కుల కోసం పోరాడాల్సిన అవసరం ఉందన్నారు.

తూర్పుగోదావరి జిల్లా కడియం పల్ల వెంకన్న నర్సరీ ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. గణతంత్ర వేడుకల సందర్భంగా నర్సరీని మువ్వన్నెల జెండాతోపాటు ఎర్రకోట ఆకృతిలో అందంగా తీర్చిదిద్దారు. దేశంపై తనభక్తి చాటిన నర్సరీ నిర్వాహకుడిపై ప్రశంసలు కురుస్తున్నాయి.

# తెలుగు రాష్ట్రాల్లో ఆహ్లాదకరంగా 'ఎట్ హోం'

## - హాజరైన సీఎంలు, అధికారులు

మొదటి పేజీ తరువాయి

రాష్ట్ర హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్ సింగ్ ఠాకుర్, హైకోర్టు న్యాయమూర్తులు, మంత్రులు నారా లోకేశ్, నారాయణ, పయ్యావుల కేశవ్, అచ్చెన్నాయుడు, పార్థసారథి, నాదెండ్ల మనోహర్, సత్యకుమార్ యాదవ్, సవిత, డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణంరాజు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, సీఎస్, డీజీపీ, ఇతర సీనియర్ అధికారులు, వివిధ రాజకీయ పార్టీల ముఖ్యనేతలు హాజరయ్యారు. ఆహ్లాదకర వాతావరణంలో ఈవెంట్ సాగింది.

### తెలంగాణలో

అటు, తెలంగాణలోని రాజ్ భవన్‌లో నిర్వహించిన 'ఎట్ హోం' కార్యక్రమం ఆహ్లాదంగా సాగింది. ఈ సందర్భంగా గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ తేనీటి విందు ఇచ్చారు. ఈ కార్యక్రమానికి సీఎం రేవంత్ రెడ్డి, స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్, హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ సుజయ్ పాల్ సహా పలువురు ప్రముఖులు హాజరయ్యారు.





# విడతల వారీగా 'ఈ కుబేర్' పద్ధతిలో రైతు భరోసా

మొదటి పేజీ తరువాయి



లబ్ధిదారులకు చెక్కులను సీఎం రేవంత్‌రెడ్డి అందజేశారు. అయితే రైతుభరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసాపై లబ్ధిదారుల్లో కొంత ఆందోళన చెందుతున్నారు. రైతు భరోసాకు సంబంధించిన డబ్బులు ఎప్పుడు తమ ఖాతాల్లో పడుతాయోనని రైతులు అయోమయంలో ఉన్నారు. ఈ డబ్బుల కోసం అన్నదాతలు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. ఈ నగదు త్వరగా అందితే పెట్టుబడి కోసం తెచ్చిన అప్పులు కొంతమేర తీర్చినట్లు అవుతుందని రైతులు అనుకుంటున్నారు. అయితే అధికారులను రైతులు వివరాలు అడిగితే ఇవాళ అర్ధరాత్రి నుంచి వారి వారి బ్యాంకు ఖాతాల్లో రైతు భరోసా నగదు జమ అవుతుందని అధికారులు అంటున్నారు. రైతులు ఈ డబ్బులపై భారీగా ఆశలు పెట్టుకున్నారు.

### రైతు భరోసా ఆలస్యానికి కారణమిదే..

రైతు భరోసా కింద ప్రభుత్వం ప్రకటించినట్లుగానే ఎకరానికి రూ. 6వేలు జమఅవుతాయి. దీంతో పాటు భూమి లేని వ్యవసాయ ఆధారిత కుటుంబాలకు ఈ సాయం అందనుంది. ఇవాళ ఆదివారం బ్యాంకులకు సెలవు కావడంతోనే ఈ సమస్య వచ్చిందని రైతులు చెబుతున్నారు. ఈ రోజు అర్ధరాత్రి 12 గంటల తర్వాత రైతుల బ్యాంకు ఖాతాల్లో నగదు జమకానుంది. ఈ మేరకు ప్రభుత్వం ప్రకటించింది. దీంతో రైతులు కొంత ఉపశమనంగా ఉన్నారు. అయితే గతంలో లాగానే మొదటి రోజు ఎకరంలోపు, ఆ తర్వాత ఎకరంన్నర, రెండెకరాలు ఇలా విడతల వారీగా 'ఈ కుబేర్' పద్ధతిలో రైతుల ఖాతాల్లో నగదు జమ కానుందని వ్యవసాయ అధికారులు చెప్పారు.

### జనవరి వరకే గడువు..

రైతులు కొత్తగా పట్టాదారు పాసు పుస్తకాలు పొందడం, గతంలో బ్యాంక్ అకౌంట్ నంబరు, ఐఎఫ్ఎస్?సీ కోడ్ తప్పుగా పడటం, బ్యాంకు ఖాతాలు సరిగా లేకపోవడం వంటి తదితర సమస్యల పరిష్కారానికి కావాల్సిన పత్రాలను క్లస్టర్ వ్యవసాయ విస్తరణాధికారులను ఇవ్వడానికి జనవరి వరకు మాత్రమే గడువు ఉంది. రైతులు అందజేసిన పత్రాలను పరిశీలించిన తర్వాత అర్హులకు పెట్టుబడి సహాయం అందజేస్తామని వ్యవసాయ అధికారులు స్పష్టం చేశారు.

### అధికారుల సర్వే.. రైతుల ఆందోళన..

కాగా తెలంగాణ రాష్ట్రంలో ఇటీవల గ్రామాల వారీగా అధికారులు సర్వే నిర్వహించారు. ఈ సర్వేలో సాగుకు అమోదయోగ్యం కాని భూముల విస్తీర్ణం వివరాలను 'ఈ కుబేర్' పోర్టల్ నుంచి తొలగిస్తున్నారు. తహసీల్దార్లు, సీసీఎల్ఏకు సంబంధించిన జాబితాల్లోనూ ఈ వివరాలు నమోదు చేస్తున్నారు. రైతులు సేద్యం చేయకుండా ఉంచారని మాత్రమే ఆయా జాబితాల్లో పొందుపరుస్తున్నారు. దీనివల్ల రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని అధికారులు చెబుతున్నారు. రైతు భరోసాలో భాగంగానే ఈ జాబితాలో నమోదు చేస్తున్నట్లు వ్యవసాయ అధికారులు అంటున్నారు. ఈ జాబితా వల్ల పట్టా భూముల వివరాల్లో ఎలాంటి తేడాలు ఉండవని స్పష్టం చేశారు. ఒకే సర్వే నంబరులో కొంత సాగుభూమి, మరికొంత సాగు చేయని భూమిగా నమోదు చేస్తారు. ఇలా నమోదు చేసిన తర్వాత రెండు నుంచి మూడు రోజుల్లో రైతు భరోసా సాయం అందజేయనున్నారు.

# ప్రశ్నిస్తే రక్తాలు వచ్చేలా విరుచుకుపడతారా..

## జనగామ లాఠీచార్జ్‌పై హరీశ్‌రావు సీరియస్



మొదటి పేజీ తరువాయి

మాజీ సర్పంచ్, 8 మంది వార్డు సభ్యులపై పోలీసులు నిరంకుశంగా దాడి చేయడం హేయమైన చర్య అని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజలు ఎన్నుకున్న ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డిని అరెస్టు చేయడం అప్రజాస్వామికమని విమర్శించారు.

ఇది ప్రజా పాలన కాదు, ప్రజాపీడనం అని హరీశ్‌రావు విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజల సమస్యలను పరిష్కరించడంలో విఫలమై, ప్రశ్నించిన ప్రతి ఒక్కరిపై అణచివేత రాజకీయాలు కొనసాగిస్తోందని మండిపడ్డారు. హామీలు అడిగితే లాఠీచార్జ్, ప్రశ్నిస్తే అరెస్టులు చేస్తున్నారని అన్నారు. ఎంతకాలం పోలీస్ పహారాలతో ప్రభుత్వం నడపాలని చూస్తున్నారని నిలదీశారు. తక్షణమే అరెస్టు చేసిన ఎమ్మెల్యే, మాజీ సర్పంచ్, వార్డు సభ్యులను విడుదల చేయాలన్నారు. ఈ ఘటనకు బాధ్యులైన పోలీసులపై కఠిన చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

# ముదిరిన పటాన్‌చెరు కాంగ్రెస్ లొల్లి



మొదటి పేజీ తరువాయి

అమీన్ పూర్ కాంగ్రెస్ కార్యాలయానికి కాంగ్రెస్ కార్యకర్తలు భారీగా చేరుకున్నారు. ఈ నెల 23వ తేదీన ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డికి వ్యతిరేకంగా కాట శ్రీనివాస్ గౌడ్ అనుచరులు ధర్నా నిర్వహించారు. ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి క్యాంప్ ఆఫీస్‌పై దాడి చేసి కుర్చీలు విరగొట్టి, సీఎం రేవంత్ రెడ్డి ఫొటోను కాంగ్రెస్ శ్రేణులు కార్యాలయం లోపల పెట్టారు. అయితే కాంగ్రెస్ కార్యకర్తల నుంచి కమిటీ సభ్యులు వివరాలు సేకరిస్తున్నారు. ఈ సందర్భంగా ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ మీడియాతో మాట్లాడారు.

పీసీసీ ప్రెసిడెంట్ మహేష్ కుమార్ గౌడ్ ఆదేశాల మేరకు పటాన్‌చెరుకు వచ్చామని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ తెలిపారు. నియోజకవర్గంలోని కాంగ్రెస్‌లో నెలకొన్న విభేదాలను సద్దుమణిగేలా చూస్తామని అన్నారు. పార్టీ కోసం కష్టపడిన కార్యకర్తల మనోభావాలను గౌరవిస్తామని చెప్పారు. కార్యకర్తల మనోభావాలకు అనుగుణంగా పార్టీ బలోపేతానికి చర్యలు చేపట్టామన్నారు. మంత్రి దామోదర రాజనర్సింహ, పార్టీ సీనియర్ నాయకుల అభిప్రాయాలు సేకరిస్తామని చెప్పారు. అందరితో మాట్లాడి నివేదిక తయారు చేస్తామని అన్నారు. పీసీసీ అధ్యక్షుడి దృష్టికి తీసుకెళ్లి ఈ సమస్య సద్దుమణిగేలా చూస్తామని ఆది శ్రీనివాస్ పేర్కొన్నారు.

# సొంత జిల్లాలో డిప్యూటీ సీఎం భట్టికి భారీ షాక్

మొదటి పేజీ తరువాయి

సొంత జిల్లాలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కకు షాక్ తగిలింది. తెలంగాణ ప్రభుత్వం అమలు చేస్తున్న నాలుగు పథకాల అమలులో భాగంగా ఎంపిక చేసిన పైలెట్ ప్రాజెక్టు గ్రామాన్ని మార్చడంతో గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేశారు. దీంతో తహిల్దర్,ఇతర ప్రభుత్వ అధికారులను ఖానాపురం గ్రామ పంచాయితీ కార్యాలయంలో పెట్టి తాళం వేశారు. ఖమ్మం - గణతంత్ర దినోత్సవం సందర్భంగా మండలానికి ఒక గ్రామం చొప్పున పైలట్ ప్రాజెక్ట్ కింద ఎంపిక చేసి జనవరి 26 నుంచి నుంచి నాలుగు పథకాలను అమలుచేయనుండగా.. ఆ గ్రామంలో కొందరు చొప్పున లబ్ధిదారులకు ప్రొసీడింగ్స్ అందజేస్తామని ప్రకటించిన విషయం తెలిసిందే.

ఈమేరకు ఖమ్మం జిల్లా ముదిగొండ మండలంలో ఖానాపురాన్ని మొదట ఎంపిక చేసినట్లు ప్రకటించగా తహసీల్దార్ సునీత ఎలిజబెత్, ఎంపీడీఓ శ్రీధర్ స్వామి, ఎంపీఓ వాల్మీకి కిశోర్ ఆధ్వర్యంలో శనివారం నుంచి సర్వే మొదలు పెట్టారు. 2 గంటల పాటు సర్వే చేశాక రాత్రి 9 గంటల సమయంలో మండలంలో పైలట్ గ్రామంగా ఖానాపురం బదులు సువర్ణాపురాన్ని ఎంపిక చేసినట్లు సమాచారం అందింది. దీంతో గ్రామపంచాయతీ కార్యాలయంలో ఉన్న అధికారులు బయల్దేరేందుకు సిద్ధమయ్యారు. ఆగ్రహించిన గ్రామస్తులు తమ గ్రామాన్ని ఎలా రద్దు చేస్తారంటూ కార్యాలయ గేట్లకు తాళం వేశారు.



# తడి బట్టలతో ఇద్దరం

## కురుమూర్తి దేవాలయానికి పోదాం.. వస్తావా?

## రేవంత్ కి మాజీ మంత్రి హరీష్ రావు సవాల్



మొదటి పేజీ తరువాయి

మహబూబ్‌నగర్ జిల్లాలోని పొలాల్లో కృష్ణా జలాలు పారించింది కేసీఆర్, బీఆర్ఎస్ పార్టీ అని హరీష్ రావు బల్లగుద్దీ చెప్పారు. ఆనాడు ఏ దరఖాస్తు లేకుండా కేసీఆర్ సంక్షేమ పథకాలు ఇయ్యలేదా..? అని రేవంత్ రెడ్డి ప్రభుత్వానికి నిలదీశారు. 11 విడతల్లో రూ.73 వేల కోట్ల నగదును కేసీఆర్.. రైతు బంధు పథకం కింద అందజేశారన్నారు.

ఇక 13 లక్షల మందికి రూ. లక్ష చొప్పున కళ్యాణ లక్ష్మీ ఇచ్చామని చెప్పారు. ఏ దరఖాస్తు లేకుండా 57 ఏళ్లకే ఆసరా పెన్షన్ ఇచ్చిన ఘనత కేసీఆర్‌దని గుర్తు చేశారు. ఎంత సేపు ప్రతిపక్షాలను తిట్టుడు.. కేసీఆర్‌ను తిట్టుడు తప్పా రేవంత్ రెడ్డికి పాలన చాత కాదని మండిపడ్డారు. అప్పుడేమో దేవుళ్ల మీద ఒట్టు పెట్టి ముక్కోటి దేవుళ్లను మోసం చేశాడంటూ సీఎం రేవంత్‌పై హరీష్ రావు విరుచుకుపడ్డారు. ఇటీవల గణతంత్ర దినోత్సవం సాక్షిగా అందరికీ సంక్షేమ పథకాలు ఇస్తానని చెప్పి.. మళ్ళీ కొందరికే అని ఈ రోజున బీఆర్ అంబేద్కర్‌ను సైతం సీఎం రేవంత్ రెడ్డి మోసం చేశారని విమర్శించారు.

ఇక ఉమ్మడి మెదక్ జిల్లాలోని గజ్వేల్ ప్రజ్ఞపూర్ మున్సిపల్ పాలకవర్గం అభినందన సభలో మాజీ మంత్రి ఎమ్మెల్యే హరీష్ రావు మాట్లాడుతూ.. ఈ ఐదేళ్లలో గజ్వేల్ దశ దిశ మారిందన్నారు. గజ్వేల్ చరిత్రలో మీ పేరు శాశ్వతంగా నిలిచిపోతుందంటూ మున్సిపల్ చైర్మన్, కౌన్సిలర్లను ఆయన అభినందించారు. ఈ కాలంలో సాగు నీరే కాదు తాగు నీరు సైతం గజ్వేల్‌కు వచ్చిందని చెప్పారు.

హైదరాబాద్ తర్వాత గజ్వేల్‌కు రింగు రోడ్డు.. అది కూడా ఆరు లైన్ల రింగు రోడ్డు రావడం చిన్న విషయం కాదన్నారు. గతంలో ఇడుపు కాగితాలను వేదికైన పాండవుల చెరువు.. ఈ రోజు పిల్లా పాపలతో కలకళలాడుతుందని పేర్కొన్నారు. ఒక అద్భుతమైన టూరిజం కేంద్రంగా అభివృద్ధి చెందిందని ఆయన సంతోషం వ్యక్తం చేశారు. గజ్వేల్ ప్రస్తుతం జిల్లా కేంద్రంగా ఉందని.. ఇక్కడికి జిల్లా ఆసుపత్రి, రైలు సైతం వచ్చాయన్నారు. విద్య, వైద్యం, మౌలిక సదుపాయాలకు కేంద్రంగా గజ్వేల్ అభివృద్ధి చెందిందన్నారు. ఈ విధంగా గజ్వేల్ దశ దిశ మార్చిన కేసీఆర్ నాయకత్వంలో కౌన్సిలర్లుగా పని చేయడం.. మీ అందరి అదృష్టమంటూ వారిపై పొగడ్తల వర్షం కురిపించారు.

ఎంత పని చేసినా ఇంకా కొంత మిగిలే ఉంటుందని.. ఇది ప్రజలకు కొరత ఉంటుందన్నారు. ఈ ఏడాది కాలంలో.. కాంగ్రెస్ పాలనలో ఒక్క పనైనా జరిగిందా.?! అంటూ స్థానికులను ఆయన సూటిగా ప్రశ్నించారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చింది... పల్లె ప్రగతి, పట్టణ ప్రగతి బంద్ అయిపోయిందని ఆయన వ్యంగ్యంగా అన్నారు. ప్రజలు అన్ని గమనిస్తున్నారని.. తొలుత ప్రజాపాలన దరఖాస్తు అన్నారని.. మొన్ననేమో కుల గణన పేరు మీద సర్వే అని దరఖాస్తులు పెట్టించారన్నారు.

ఇప్పుడేమో గ్రామసభల పేరు మీద మళ్లీ దరఖాస్తులు అంటున్నారని.. అప్లై.. అప్లై.. నో రిప్లై అన్నట్లుగా అయిపోయిందంటూ ఆయన అసహనం వ్యక్తం చేశారు. ఈ రోజు సీఎం రేవంత్ రెడ్డి పెద్ద పెద్ద మాటలు మాట్లాడుతున్నారని గుర్తు చేశారు. అనాడు ఏ దరఖాస్తు లేకుండా కేసీఆర్ సంక్షేమ పథకాలు ఇయ్యలేదా..?! అని ప్రశ్నించారు. కేసీఆర్ పేరు తీయకుండా ఒక్క ఉపన్యాసం అన్న ఇచ్చావా?.. దావోస్ పోతే కూడా నీకు కేసీఆర్ యాది కోస్తున్నాడా ! అంటు రేవంత్ రెడ్డికి హరీష్ రావు చురకలంటించారు.

# నాడు అందరికీ అన్నీ అని... నేడు కొందరికే కొన్ని మభ్యపెడుతున్న కాంగ్రెస్ - కేటీఆర్

మొదటి పేజీ తరువాయి



హైదరాబాద్,,26 జనవరి ( క్రాంతి న్యూస్ ): ఎన్నికల్లో నాడు "అందరికీ అన్నీ.." అని..నేడు "కొందరికే కొన్ని.." పేరిట మభ్యపెడితే నాలుగు కోట్ల తెలంగాణ మీ నయవంచనను క్షమించదని కేటీఆర్ హెచ్చరించారు. ఎన్నికలప్పుడు తెలంగాణలోని ప్రతి మండలం..ప్రతి గ్రామంలోని..ప్రతి ఇంటా..అబద్ధపు హామీలను ఊదరగొట్టి.."వన్ ఇయర్" తరువాత "వన్ విలేజ్"అనడం ప్రజలకు వెన్నుపోటు పొడవడమేనని కేటీఆర్ విమర్శించారు. ప్రతిపక్షంగా ఇంకో నాలుగేళు ...ఓపిక పట్టడానికి మేము సిద్ధం కానీ.. ఏరు దాటక తెప్ప తగలేసే మీ ఏడాది దగా పాలన చూసిన తరువాత ఆగడానికి ప్రజలు మాత్రం సిద్ధంగా లేరన్నారు. గుర్తుపెట్టుకోండి. "పథకాలు రాని గ్రామాల్లో.." రేపటి నుంచి.."ప్రజా రణరంగమే..!!" అంటూ కేటీఆర్ కాంగ్రెస్ పార్టీని హెచ్చారించారు.

## మహిళ ఇంటి ముందు బ్యాంక్ అధికారుల

# వినూత్న నిరసన,

## వంటావార్పుతో అంతా షాక్



వరంగల్: ప్రైవేట్ వడ్డీ వ్యాపారుల వద్ద అప్పు తీసుకున్న వ్యక్తులు సమయానికి అప్పు కట్టకుంటే పరిస్థితి దారుణంగా ఉంటుంది. నిర్వాహకులు పంపే సిబ్బంది లోన్ తీసుకున్న వారి ఇంటికి వెళ్లి నిలదీయడంతోపాటు ఒత్తిడి చేస్తారు. కానీ బ్యాంకు అధికారులు సైతం మొండి బకాయిలను వసూలు చేసుకోవడానికి అప్పుతీసుకున్న వారి ఇంటికి వెళ్లి లోన్ బకాయిలు కట్టాలని ఒత్తిడి పెంచడంతో పాటు వినూత్న ఆందోళనలు దిగుతున్నారు. ఇలాంటి సంఘటనే జనగామ జిల్లాలో జరిగింది.

## అప్పు కట్టలేదని వినూత్న నిరసన

లోన్ డబ్బులు వసూలు చేసుకోవడానికి బ్యాంక్ అధికారులు వినూత్న నిరసన చేపట్టారు. బ్యాంకులో అప్పు కట్టలేదని ఇంటి ముందు పొయ్యి పెట్టారు. ఈ ఘటన జనగామ జిల్లా దేవరుప్పుల మండలం పెద్దతండా లో చోటు చేసుకుంది. పెదతండాకు చెందిన గుగులోత్ లక్ష్మి తెలంగాణ గ్రామీణ బ్యాంకులో మహిళా సంఘంలో రుణం తీసుకొంది. ఇంకా 61 వేలు అప్పు పెండింగ్ ఉంది. లక్ష్మి అప్పు కట్టకపోవడంతో అధికారులు, మహిళ సంఘం మహిళలతో కలిసి లోన్ పెండింగ్ నగదు కట్టాలని గుగులోత్ లక్ష్మి ఇంటి ముందు పొయ్యి పెట్టి బ్యాంక్ అధికారులు వంటావార్పు చేశారు. ఈ రోజు పది వేలు, 28 వ తేదీన 51 వేలు కట్టాలని లేకుంటే బ్యాంక్ అధికారులు, సర్ఫ్ డిపార్ట్ మెంట్ అధికారులు లక్ష్మి ఇంటి ముందు కూర్చొని నిరసన తెలుపుతారని బ్యాంక్ అధికారి హెచ్చరించారు.

అంతే కాకుండా గ్రామంలోని రాజయ్య అనే వ్యక్తి కూడా లోన్ నగదు కట్టక పోవడంతో ఆయన ఇంటి ముందు కూర్చొని నిరసన తెలిపారు. అయితే ఈ ఘటన ఈనెల 24 వ తేదీన జరగగా ఆలస్యంగా వెలుగు లోకి వచ్చింది.

# ఉత్తమ సేవలకు దక్కిన అరుదైన గౌరవం...!

## ఉత్తమ అధికారులుగా ఎంపికైన ఎస్ఐ బి అశోక్, సబ్ సెంటర్ డాక్టర్ సంధ్య, కార్యదర్శి అనూష, ఏఎల్ఎం మహిపాల్.

చిట్యాల,26 జనవరి (క్రాంతిన్యూస్ జూ): జయశంకర్ భూపాలపల్లి జిల్లా మొగుళ్లపల్లి మండలంలో పలుశాఖల్లో..వివిధ హోదాల్లో పని చేస్తున్న అధికారులు ప్రజలకు ఉత్తమ సేవలు అందించడంతో వారిని గుర్తించిన ఉన్నతాధికారులు రిపబ్లిక్ డే జనవరి 26న జయశంకర్ భూపాలపల్లి జిల్లా కేంద్రంలో నిర్వహించిన గణతంత్ర దినోత్సవంలో భాగంగా వారిని ఘనంగా శాలువాలతో సత్కరించి ప్రశంసా పత్రాలను అందించారు. ఈ సందర్భంగా వృత్తి ధర్మంలో నిరంతరం 24 గంటల పాటు ప్రజాసేవలో నిమగ్నమైన ఎస్ఐ బి అశోక్, వేములపల్లి సబ్ సెంటర్ డాక్టర్ సంధ్య, బంగ్లాపల్లి పంచాయతీ సెక్రెటరీ అనూష, ఏఎల్ఎం మహిపాల్ లను ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు, జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మలు ప్రశంసా పత్రాలను అందించి..వారిని శాలువాలతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు మాట్లాడారు. ఎంతో కష్టపడి చదివి..ఉన్నతమైన స్థానంలో ఉండి..మంచి సహృదయంతో..నిస్వార్థంగా సేవ చేస్తూ..ప్రజల మనస్సును గెలుచుకున్న అధికారులు అరుదుగా ఉంటారని, వారే ఉన్నతమైన స్థానంలో నిలబడతారని ఎమ్మెల్యే గండ్ర, జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ కొనియాడారు. ఈ సందర్భంగా ఉన్నతాధికారులుగా ఎంపికై అవార్డులను స్వీకరించిన ఉత్తమ అధికారులను మండలంలోని ప్రజాప్రతినిధులు, తోటి ఉద్యోగులు అభినందిస్తున్నారు.





# వంటగదిలో ఎలుకలు, బొద్దింకలు..

## శ్రీచైతన్య విద్యా సంస్థల సెంట్రల్ కిచెన్ లైసెన్స్ రద్దు



హైదరాబాద్ మాదాపూర్‌లోని శ్రీచైతన్య విద్యా సంస్థలకు సంబంధించిన సెంట్రల్ కిచెన్ లైసెన్స్‌ను ఫుడ్ సేఫ్టీ డిపార్ట్‌మెంట్ రద్దు చేసింది. కిచెన్‌లో ఆహార తయారీని తక్షణమే నిలిపివేయాలని ఆదేశిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. ఉత్తర్వులు ఉల్లంఘించి వంట తయారు చేస్తే, కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించింది.

శ్రీచైతన్య విద్యాసంస్థలోని కిచెన్‌లో శుక్రవారం నాడు ఫుడ్ సేఫ్టీ అధికారులు ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఈ కిచెన్ నుంచే గ్రేటర్ హైదరాబాద్‌లోని చైతన్య కాలేజీల హాస్టళ్లకు ఫుడ్ సరఫరా చేస్తున్నట్టు ఫుడ్ సేఫ్టీ అధికారులు గుర్తించారు. ఇక్కడ వండే భోజనాన్ని హాస్టళ్లలోని వేల మంది విద్యార్థులకు రోజూ అందజేస్తున్నారు. వేల మందికి భోజనాన్ని తయారు చేస్తున్న కిచెన్ అపరిశుభ్రంగా ఉండటంపై ఫుడ్ సేఫ్టీ అధికారులు ఆగ్రహం వ్యక్తం చేశారు. కిచెన్‌లో పాడైపోయిన ఆహార పదార్థాలు నిల్వ ఉన్నట్టు గుర్తించారు.

సుమారు 125 కిలోల గడువు తీరిన ఆహార పదార్థాలను అధికారులు సీజ్ చేశారు. బియ్యం, కూరగాయలు, పప్పుదినుసులను అపరిశుభ్ర వాతావరణంలో స్టోర్ చేస్తున్నట్టు గుర్తించారు. కిచెన్, స్టోర్ రూమ్‌లో బొద్దింకలు, ఎలుకలు తిరుగుతున్నట్టు గుర్తించిన అధికారులు, కిచెన్‌ను సీజ్ చేయాలని, ఫుడ్ లైసెన్స్‌ను రద్దు చేయాలని ఉన్నతాధికారులకు నివేదిక ఇచ్చారు. ఈ మేరకు అధికారులు మాదాపూర్(ఖానామెట్)లోని చైతన్య విద్యా సంస్థల సెంట్రల్ కిచెన్ లైసెన్స్‌ను రద్దు చేస్తూ ఫుడ్ సేఫ్టీ అధికారులు తాజాగా ఉత్తర్వులు జారీ చేశారు. కిచెన్‌లో ఆహార తయారీని తక్షణమే నిలిపివేయాలని ఆదేశించారు. ఉత్తర్వులు ఉల్లంఘించి వంట తయారు చేస్తే, కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

# డబ్బుల కోసమే వ్యాపారి హత్య



పాన్ మసాలా వ్యాపారిని నగరంలో కిడ్నాప్‌చేసి, ఖమ్మం జిల్లాలో హత్యకు పాల్పడిన కేసులో ప్రధాన నిందితుడిని కారా?నా పోలీసులు అరెస్టు చే యగా, మరో ముగ్గురు పరారీలో ఉన్నారు. ఇన్‌స్పెక్టర్ రామకృష్ణ తెలిపిన వివరాల ప్రకారం కారా?నా, విక్రమ్‌పురికి చెందిన బొల్లు రమేశ్ (51), జననీ భార్యాభర్తలు. వీరికి ఒక కుమారుడు ఉన్నాడు. రమేశ్.. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లో పాన్ మసాల వ్యాపారం చేస్తుంటాడు.

ఈ నెల 18న రమేశ్ ఆఫీసుకు వెళ్లి రాకపోవడంతో 19న అతని భార్య జననీ కారా?నా పోలీస్ స్టేషన్‌లో కీస్ అవెన్యూ కాలనీ, బం డ్లగూడ, చాంద్రాయగుట్ట ప్రాంతానికి చెందిన సయ్యద్ సజ్జాద్ అహ్మద్‌ఖాన్‌పై అనుమానం ఉందని ఫిర్యాదు చేసింది. వెంటనే పోలీసులు అతడిని అదుపులోకి తీసుకొని విచారించగా.. మరో ముగ్గురితో కలిసి రమేశ్‌ను హత్య చేసినట్టు ఒప్పుకున్నాడు. వెంటనే నిందితుడు అహ్మద్ ఖాన్‌ను తీసుకొని ఖమ్మం జిల్లా, కూసుమంచిలో హత్యకు గురైన ఘటనా స్థలానికి తీసుకెళ్లి పరిశీలించారు. మృతదేహం కుళ్లిపోయి దుర్వాసన వెదజల్లుతుండడంతో స్థానిక ప్రభుత్వ వైద్యులను పిలిపించి ఘటనా స్థలంలో పోస్టుమార్టం నిర్వహించారు. శనివారం ప్రధాన నిందితుడు సయ్యద్ సజ్జాద్ అహ్మద్ ఖాన్‌ను రిమాండ్‌కు తరలించారు. పరారీలో ఉన్న మరో ముగ్గురు నిందితుల కోసం గాలిస్తున్నారు.

## పాన్‌మసాలా డబ్బులు ఇస్తామని ..

పాన్ మసాల వ్యాపారి బొల్లు రమేశ్ వద్దకు ఈ నెల 18న ప్రధాన నిందితుడు అహ్మద్‌ఖాన్‌తో పాటు ఒబైద్ మీర్జా, ఫర్వేజ్‌లతో పాటు మరో వ్యక్తి వెళ్లాడు. సూమారు రూ.6లక్షల పాన్ మసాల సరుకును కొనుగోలు చేశారు. రమేశ్‌వద్ద అధిక సంఖ్యలో డబ్బులు ఉన్నాయని గుర్తించిన నిందితులు డబ్బు లు ఇస్తామని కాచిగూడకు రమ్మని చెప్పగా రమేశ్ అక్కడికి వెళ్లాడు. అక్కడ రమేశ్‌ను కారు లో ఎక్కించుకొని కాళ్లు, చేతులు కట్టేసి కిడ్నాప్ చేశారు.

రమేశ్ అకౌంట్ నుంచి రూ.15లక్షలను వారి అకౌంట్‌కు బదిలీ చేసుకున్నారు. అయితే.. రమేశ్‌ను వదిలివేస్తే తమ విషయం బయట పడుతుందనని ఈ నెల 19న ఉదయం తెల్లవారుజామున ఖమ్మం జిల్లా కూసుమంచి మం డలం, లింగారు తండా సమీపంలోని మిర్చితోటలోకి తీసుకెళ్లిహత్యచేసి పారిపోయారు. అనంతరం మిర్చితోట యజమాని గుర్తించి స్థానిక పోలీసులకు సమాచారం అందించా రు. అదే సమయంలో కారా?నా పోలీసులు సైతం ప్రధాన నిందితుడిని తీసుకుని ఘట నా స్థలాన్ని పరిశీలించి.. హత్యకు గురైన వ్యక్తి రమేశ్ అని గుర్తించారు.

## తిరుమలలో అతిథి గృహాల పేర్లు మార్పు

**ఎంపీ వేమిరెడ్డి భవనం పేరు మార్చారు**

**మిగిలిన భవనాల పేర్లను మార్చేస్తారు**




తిరుపతి,26 జనవరి ( క్రాంతి న్యూస్ ): టీటీడీ పాలకమండలి తిరుమలలో దాతల సహకారంతో నిర్మించిన అతిథి గృహాల (గెస్ట్ హౌస్‌లు)కు కీలక నిర్ణయం తీసుకుంది. కొండపై గతంలో ఈ భవనాలకు ఆయా సంస్థలు, వ్యక్తుల పేర్లు ఉన్నాయి.. అయితే ఆ పేర్లు మార్చాలని పాలకమండలి ఇటీవల నిర్ణయించింది. ఈ మేరకు పేర్లు మార్చడం మొదలైంది.. ముందుగా నెల్లూరు టీడీపీ ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, టీటీడీ పాలకమండలి సభ్యురాలు వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి దంపతుల విరాళంతో తిరుమలలో లక్ష్మీ వీపీఆర్ భవనాన్ని నిర్మించిన సంగతి తెలిసిందే. అయితే ఈ భవనం పేరును లక్ష్మీ వీపీఆర్ భవనం బదులుగా.. లక్ష్మీ భవన్‌గా మార్చారు. అలాగే ఇదే తరహాలో తిరుమలలో దాతల సహకారంతో నిర్మించిన 45 అతిథి గృహాలకు వ్యక్తిగత పేర్ల స్థానంలో ఆధ్యాత్మిక, ధార్మిక పేర్లుగా మార్చనున్నారు. ఇప్పటికే పలువురు దాతలు ఈ పేర్లు మార్చేందుకు అంగీకారం తెలియజేశారు.

### తిరుమలలో ముగిసిన అధ్యయనోత్సవాలు

తిరుమల శ్రీవేంకటేశ్వరస్వామివారి ఆలయంలో గత ఏడాది డిసెంబరు 30వ తేదీ నుండి జరిగిన అధ్యయనోత్సవాలు గురువారం ముగిశాయి. ఈ సందర్భంగా ఆలయంలోని రంగనాయకుల మండపంలో శ్రీదేవి, భూదేవి సమేత శ్రీ మలయప్పస్వామివారిని వేంచేపు చేసి దివ్యప్రబంధ గోష్ఠి నిర్వహించారు. గత 25 రోజులుగా శ్రీవారి ఆలయంలో శ్రీవైష్ణవ జీయంగార్లు 12 మంది ఆళ్వార్లు రచించిన దివ్యప్రబంధ పాశురాలను గోష్ఠిగానం ద్వారా ప్రతి రోజు స్వామివారికి నివేదించారు. ఆళ్వార్ దివ్యప్రబంధంలోని 4 వేల పాశురాలను పారాయణం చేశారు. గురువారంనాడు అధ్యయనోత్సవాల్లో చివరిరోజు కావడంతో "తన్నీరముదు" ఉత్సవం నిర్వహించారు. అధ్యయనోత్సవాలు ముగిసిన అనంతరం మరుసటిరోజు అనగా జనవరి 24న శ్రీదేవి భూదేవి సమేత శ్రీ మలయప్పస్వామివారు దక్షిణ మాడ వీధిలోని శ్రీ తిరుమలనంబి ఆలయానికి వేంచేస్తారు.

### ఘనంగా తిరుమలనంబి తన్నీరముదు ఉత్సవం

శ్రీ వైష్ణవ భక్తాగ్రేసరుడు, శ్రీవేంకటేశ్వరుని సేవలో తన జీవితాన్ని అర్పించిన మహనీయుడైన శ్రీ తిరుమలనంబి స్మృత్యర్థం ప్రతి ఏడాదీ నిర్వహించే తన్నీరముదు ఉత్సవం తిరుమలలో గురువారం ఘనంగా జరిగింది. సాయంత్రం సహస్ర దీపాలంకార సేవ అనంతరం శ్రీ మలయప్పస్వామివారు తిరుమాడ వీధి ఆలయ ప్రదక్షిణముగా వాహన మండపానికి వేంచేపు చేస్తారు. తిరుమలనంబి ఆలయం నుండి ప్రదక్షిణగా తిరుమలనంబి వంశీకులు శిరస్సుపై బిందెలతో ఆకాశగంగ తీర్థాన్ని వాహన మండపానికి తీసుకొస్తారు. అనంతరం వేదమంత్రోచ్చారణ నడుమ జీయర్ స్వాములు, ఆచార్య పురుషులు, ప్రబంధ పండితులు పవిత్ర తీర్థజలంతో ఆలయంలోకి వేంచేపు చేశారు.

అనంతరం ఆలయ అర్చకులు స్వామివారి మూలవిరాట్టు పాదాలపై అమరి ఉన్న బంగారు తొడుగునకు పవిత్ర ఆకాశగంగ జలంతో అభిషేకం చేశారు. ఈ సందర్భంగా తిరుమలనంబి రచించిన తిరుమొళి పాశురాలను పారాయణం చేశారు. ఈ కార్యక్రమంలో తిరుమల శ్రీశ్రీశ్రీ పెద్ద జీయర్ స్వామి, తిరుమల శ్రీశ్రీశ్రీ చిన్న జీయర్ స్వామి, ఆలయ అధికారులు పాల్గొన్నారు.

# వికసిత్ భారత్

**స్వర్ణాంధ్ర విజన్ సాధనకు రాజ్యాంగ స్ఫూర్తితో కృషి**

**: చంద్రబాబు**

అమరావతి: ,26 జనవరి ( క్రాంతి న్యూస్ ): ఏపీలో కూటమి ప్రభుత్వం వికసిత్ భారత్ , స్వర్ణాంధ్ర విజన్ సాధనకు రాజ్యాంగ స్ఫూర్తితో కృషి చేస్తుందని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అన్నారు. 76వ గణతంత్ర దినోత్సవం సందర్భంగా ఉండవల్లిలోని తన నివాసంలో జాతీయ జెండా ఎగురవేశారు. ఈ సందర్భంగా దేశ ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు. మహనీయుల త్యాగాలను మరోసారి స్మరించుకుందామని సీఎం అన్నారు.

శాసనసభలో స్పీకర్ అయ్యన్నపాత్రుడు ఆవిష్కరించి మాట్లాడారు. జాతీయ సమైక్యత, సమగ్రత, సోదరభావం అనే మూలాల మీద ఏర్పడిన భారత రాజ్యాంగం అమల్లోకి వచ్చి నేటికి 76 సంవత్సరాలైనా సందర్భంగా ప్రజలందరికీ గణతంత్ర దినోత్సవం శుభాకాంక్షలు తెలిపారు. ఏపీ సచివాలయంలో సీఎస్ విజయానంద్ జాతీయ జెండాను ఎగురవేశారు.

గణతంత్ర దినోత్సవం వేడుకలను భిన్నత్వంలో ఏకత్వంలా ఘనంగా జరుపుకుందామని వైసీపీ అధ్యక్షుడు, మాజీ సీఎం వైఎస్ జగన్ ట్విటర్‌లో పేర్కొన్నారు. భారత రాజ్యాంగాన్ని మరింత బలోపేతం చేయడానికి కలిసికట్టుగా ఉందామని అన్నారు.



## గత పాలన వైఫల్యం కారణంగా రాష్ట్రం అప్పులపాలు

**: ఏపీ గవర్నర్**



అమరావతి: ,26 జనవరి ( క్రాంతి న్యూస్ ): అమరావతి : గత వైసీపీ పాలనలో నాయకత్వ వైఫల్యం కారణంగా రాష్ట్రం అప్పులపాలయ్యిందని ఏపీ గవర్నర్ అబ్దుల్ నజీర్ అన్నారు. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం ప్రజల ఆకాంక్షలు నెరవేర్చే దిశగా పని చేస్తోందని ప్రశంసించారు. గణతంత్ర వేడుకల సందర్భంగా విజయవాడ మున్సిపల్ గ్రౌండ్‌లో గవర్నర్ జాతీయ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రజలనుద్దేశించి మాట్లాడారు.గత ప్రభుత్వం భారీగా అప్పులు చేసి సమస్యలు సృష్టించిందన్నారు. ప్రజలకు ఆరోగ్యం, ఐశ్వర్యం, ఆనందం కలగాలనేదే ప్రభుత్వ నినాదమని పేర్కొన్నారు. నదుల అనుసంధానం ఒక గేమ్ ఛేంజర్ అన్నారు. ప్రజలు అభివృద్ధి, సంక్షేమాన్ని కోరుకుంటున్నారని తెలిపారు. 10 సూత్రాల అమలు ద్వారా అనుకున్న లక్ష్యాలు సాధిస్తామని వెల్లడించారు.

గత ప్రభుత్వ పాలనలో లోపాలు, ఆర్థిక వైఫల్యం కారణంగా అప్పులు భారం పెరిగిందని అన్నారు. విశాఖ స్టీల్ ప్లాంట్‌కు కేంద్రం నుంచి ప్రత్యేక ప్యాకేజీ వచ్చేలా చేసినట్లు వివరించారు. గత ఎన్నికల్లో చంద్రబాబు నాయకత్వంలో ఎన్డీయే కూటమికి 93 శాతం మంది ఓటర్లు తీర్పునిచ్చారని అన్నారు.

7నెలల పాలనలో ప్రజల నమ్మకాలకు అనుగుణంగా ప్రభుత్వం పనులు చేపడుతుందని అన్నారు. ప్రభుత్వం రాష్ట్రాన్ని పునర్నిర్మాణం చేస్తుందని పేర్కొన్నారు. ప్రణాళిక బద్ధంగా ప్రభుత్వం పనిచేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో ముఖ్యమంత్రి చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్, ఎంపీలు, మంత్రులు, ఎమ్మెల్యేలు పాల్గొన్నారు. అంతకుముందు గవర్నర్ పోలీసుల గౌరవ వందనం స్వీకరించారు.

# పద్మభూషణ్ పురస్కారానికి ఎంపికైన బాలయ్యకు ఏపీ సీఎం చంద్రబాబు అభినందనలు



అమరావతి: ,26 జనవరి ( క్రాంతి న్యూస్ ): పద్మభూషణ్ పురస్కారానికి ఎంపికైన తెలుగు సినీ నటుడు, హిందూపురం ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణకు ఆంధ్రప్రదేశ్ సీఎం నారా చంద్రబాబు అభినందనలు తెలిపారు. ఎన్టీఆర్ వారసత్వాన్ని నిలబెడుతూ సినిమా, రాజకీయ రంగాల్లో రాణిస్తున్నారని పేర్కొన్నారు. బసవ తారకం క్యాన్సర్ దవాఖాన ద్వారా ప్రజా సంక్షేమానికి అంకిత భావంతో ఎంతో మందిని కాపాడుతున్నారని గుర్తు చేశారు. ఎంతో మంది జీవితాలకు స్ఫూర్తినిస్తున్న నిజమైన ఐకానిక్ నాయకుడికి తగిన గౌరవం లభించిందన్నారు.

సినీ నటుడు, బాలకృష్ణ మామయ్యకు పద్మభూషణ్ పురస్కారం లభించడం తమ కుటుంబానికి ఎంతో గర్వ కారణం అని ఆంధ్రప్రదేశ్ మంత్రి నారా లోకేశ్ పేర్కొన్నారు. సోషల్ మీడియా వేదిక ఎక్స్ ఖాతా వేదికగా బాలకృష్ణకు హృదయ పూర్వక అభినందనలు తెలిపారు. 'బ్లాక్ బస్టర్ హిట్ సినిమాల నుంచి లక్షలాది మందికి స్ఫూర్తినివ్వడంతోపాటు సినిమా, రాజకీయ, ఆరోగ్య సంరక్షణకు ముందుకు సాగుతున్న సుదీర్ఘ ప్రయాణంలో మీ విశేషమైన సేవలకు ఈ అవార్డు నిదర్శనం. మీ విజయాలను గుర్తించినందుకు సంతోషం' అని లోకేశ్ ట్వీట్ చేశారు.

ప్రతిష్టాత్మక పద్మభూషణ్ అవార్డు అందుకున్న బాలయ్య బాబాయికి హృదయపూర్వక అభినందనలు అని సినీ నటుడు జూనియర్ ఎన్టీఆర్ ట్వీట్ చేశారు. 'సినిమా రంగానికి మీరు చేసిన అసమాన సేవలు, మీ నిర్విరామ ప్రజాసేవకు ఈ గుర్తింపు నిదర్శనం' అని ఎన్టీఆర్ పేర్కొన్నారు.

# ఏపీలో మరో పథకం అమలుపై కీలక అప్డేట్

**తల్లికి వందనం అమలుపై మంత్రి ప్రకటన**

**ముహూర్తం ఎప్పుడో చెప్పిన మంత్రి స్వామి**



అమరావతి ,26 జనవరి ( క్రాంతి న్యూస్ ): ఆంధ్రప్రదేశ్‌లో కూటమి ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా నెరవేరుస్తోంది. ఇప్పటికే పలు హామీలను నిలబెట్టుకోగా.. తాజాగా సూపర్ సిక్స్‌లో భాగంగా ఇచ్చిన హామీల అమలుకు కసరత్తు చేస్తోంది. తాజాగా మరో పథకం అమలుకు సిద్ధమైనట్లు తెలుస్తోంది.. ఈ మేరకు మంత్రి కీలక వ్యాఖ్యలు చేశారు. రాష్ట్రం అప్పుల్లో ఉన్నా సరే.. సూపర్ సిక్స్ పథకాలను ఒక్కొక్కటిగా అమలు చేస్తున్నామని డోలా శ్రీ బాలవీరాంజనేయ స్వామి తెలిపారు. మంత్రి నెల్లూరు జిల్లా కందుకూరులో ఓ కార్యక్రమానికి హాజరయ్యారు.. అక్కడ సభలో కీలక వ్యాఖ్యలు చేశారు. గత ప్రభుత్వ పాలనలో రాష్ట్రం నాశనమైందన్నారు.

సూపర్ సిక్స్ పథకాల్లో కీలకమైన తల్లికి వందనం పథకంపై మంత్రి డోలా శ్రీ బాలవీరాంజనేయ స్వామి కీలక వ్యాఖ్యలు చేశారు. ఈ పథకాన్ని ఈ ఏడాది మే నెల నుంచి ప్రారంభిస్తామని తెలిపారు.. ఈ మేరకు కసరత్తు జరుగుతోందన్నారు. దేశంలో ఏ రాష్ట్రంలో లేని విధంగా ఏపీలో మాత్రమే రూ.4వేలు పింఛన్ అందిస్తున్నామన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి ఆరు నెలలైందని.. తమ చేతిలో మంత్రదండం ఏమీ లేదని.రు. గత ప్రభుత్వం రాష్ట్రాన్ని అప్పుల పాలు చేసినా సరే తిరిగి పునర్ నిర్మాణాన్ని చేస్తున్నామన్నారు. ఇచ్చిన హామీల ప్రకారం ఒక్కొక్కటి నిలబెట్టుకుంటున్నామన్నారు. పథకాలు ఎందుకు అమలు చేయడం లేదని ప్రశ్నించేవారికి సిగ్గుండాలని ఘాటు వ్యాఖ్యలు చేశారు. ఎన్నికల సమయంలో కూటమి తల్లికి వందనం కార్యక్రమంపై హామీ ఇచ్చింది.. అర్హత ఉండి బడికి వెళ్లే విద్యార్థులకు ఒక్కొక్కరికి ప్రతి ఏటా రూ.15వేలు ఇస్తామని ప్రకటించిన సంగతి తెలిసిందే. ఈ పథకం అమలుకు సిద్ధమవుతున్నట్లు మంత్రి స్వామి కీలకమైన ప్రకటన చేశారు.

ఆంధ్రప్రదేశ్ సార్వత్రిక ఎన్నికల సమయంలో కూటమి సూపర్-6 పథకాలను ప్రకటించింది. ఇప్పటికే మహిళలకు ఉచిత గ్యాస్ సిలిండర్ల పథకాన్ని అమలు చేస్తోంది. తల్లికి వందనం, అన్నదాత సుఖీభవ, మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం, నిరుద్యోగ భృతి, ఆడబిడ్డ నిధి కింద మహిళలకు నెలకు రూ.1500 వంటి పథకాలపై కసరత్తు చేస్తోంది. త్వరలోనే మార్గదర్శకాలను విడుదల చేసి పథకాన్ని అమలు చేస్తామని ప్రభుత్వం చెబుతోంది. ఈ మేరకు ఇటీవల బడ్జెట్‌లో నిధులు కూడా కేటాయించిన సంగతి తెలిసిందే. అయితే తల్లికి వందనం పథకంపై మాత్రం మంత్రి క్లారిటీ ఇచ్చారు. గత ప్రభుత్వ హయాంలో అమ్మఒడి పేరుతో ప్రతి ఏటా ఒక్కో విద్యార్థికి రూ.10వేలు అందించేవారు. కూటమి ప్రభుత్వం తల్లికి వందనం పథకం పేరుతో రూ.15వేలకు పెంచింది. ఇప్పుడు ఈ పథకం అమలు కోసం కసరత్తు చేస్తోంది.. త్వరలోనే మార్గ దర్శకాలను విడుదల చేసే అవకాశం ఉందంటున్నారు.

## కాలేజీ మూడో ఫ్లోర్ నుంచి దూకిన ఇంటర్ విద్యార్థి..

**సీసీ కెమెరాలో దృశ్యాలు**

అనంతపురం ,26 జనవరి ( క్రాంతి న్యూస్ ): అనంతపురం జిల్లాలో తీవ్ర విషాదకరమైన ఘటన ఒకటి జరిగింది. ఇంటర్ ఫస్ట్ ఇయర్ చదువుతున్న ఓ విద్యార్థి.. కాలేజీలోనే బలవన్మరణానికి పాల్పడ్డాడు. అప్పటివరకు అందరు విద్యార్థులతోనే క్లాస్‌రూంలోనే ఉన్న ఆ స్టూడెంట్.. ఒక్కసారిగా లేచి బయటికి వెళ్లి కాలేజీ మూడో అంతస్తు నుంచి దూకేశాడు. ఈ ఘటనలో అతడు అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయాడు. అయితే అక్కడ ఏం జరుగుతుందో అర్థం కాని.. మిగితా స్టూడెంట్స్ అయోమయంగా చూశారు. ఈ ఘటనకు సంబంధించిన వీడియో అక్కడే ఉన్న సీసీటీవీ ఫుటేజీలో రికార్డ్ అయింది. ఇప్పుడు ఆ వీడియో బయటికి రావడంతో సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతోంది. అయితే అతడు ఎందుకు ఆత్మహత్య చేసుకున్నాడు అనేది మాత్రం ఇంకా తెలియరాలేదు.

చరణ్ అనే ఇంటర్ మొదటి సంవత్సరం చదువుతున్న విద్యార్థి గురువారం ఉదయం 10.15 గంటలకు క్లాస్‌రూంలో నుంచి లేచి.. అందరూ చూస్తుండగానే బయటకు వచ్చిన చరణ్.. మూడవ అంతస్తు రేలింగ్ నుంచి కిందికి దూకి ప్రాణాలు తీసుకున్నాడు. అయితే అతడ్ని ఆస్పత్రికి తరలిస్తుండగానే మార్గమధ్యలో చనిపోయినట్లు కాలేజీ వర్గాలు వెల్లడించాయి. అయితే చరణ్ ఆత్మహత్య చేసుకోవడానికి గల కారణాలు ఏంటి అనేది ఇంకా తెలియరాలేదు.



అయితే కాలేజీలోనే చరణ్ ప్రాణాలు తీసుకున్నాడనే విషయం తెలుసుకున్న విద్యార్థి సంఘాలు.. వెంటనే అక్కడికి చేరుకుని.. కళాశాల ఎదుట ఆందోళన చేపట్టాయి. పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని కళాశాల ముందు బందోబస్తు ఏర్పాటు చేశారు. ఈ హృదయ విదారక ఘటన కాలేజీ సెక్యూరిటీ కెమెరాలో రికార్డ్ కావడంతో ఇప్పుడు అది వైరల్ అవుతోంది.

ఇక ఈ ఘటనపై కేసు నమోదు చేసుకున్న పోలీసులు.. అన్ని కోణాల్లో దర్యాప్తు ప్రారంభించారు. విద్యార్థి ఎందుకు ఆత్మహత్యకు పాల్పడ్డాడు అనే విషయంపై ఆరా తీస్తున్నారు. చరణ్ మానసిక పరిస్థితి గురించి కుటుంబ సభ్యులు, స్నేహితులను అడిగి పోలీసులు సమాచారం సేకరిస్తున్నారు. కాలేజీలో చదువు ఒత్తిడి వల్ల ప్రాణాలు తీసుకున్నాడా.. లేక ఇంట్లో పరిస్థితులా.. మరేదైనా ఇతర కారణాల వల్ల చరణ్ ఆత్మహత్య చేసుకున్నాడా అని పోలీసులు ఆరా తీస్తున్నారు.

# కొత్తగూడెం ఏరియాలో 76వ గణతంత్ర దినోత్సవ వేడుకలు



భద్రాద్రి కొత్తగూడెం,26 జనవరి (క్రాంతిన్యూస్ ): 76వ గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకొని తేదీ:26.01.2025న కొత్తగూడెం ఏరియా జనరల్ మేనేజర్ కార్యాలయములో ఎం. షాలేం రాజు, జనరల్ మేనేజర్, కొత్తగూడెం ఏరియా ఉదయం 9.00గంటలకు జాతీయ పతాకావిస్కరణ గావించారు. ఈ కార్యక్రమములో ఎం. షాలేం రాజు, జనరల్ మేనేజర్, కొత్తగూడెం ఏరియా ప్రసంగించినారు. అనంతరం కొత్తగూడెం ఏరియా ప్రధాన గణతంత్ర దినోత్సవ వేడుకలలో భాగముగా ప్రగతి వనం రుద్రంపూర్ లో ఉదయం 9.30 గంటలకు జాతీయ పతాకావిస్కరణ అనంతరం ఎస్అండ్ పిసి మరియు ప్రైవేట్ సెక్యూరిటి గార్డ్స్ వివిధ పాట శాలల విద్యార్ధుల కవాతును ముఖ్య అతిది ఎం. షాలేం రాజు, జనరల్ మేనేజర్, కొత్తగూడెం ఏరియా స్వీకరించారు. తదుపరి ముఖ్య అతిది ఎం. షాలేం రాజు ఉద్యోగులను అందరినీ ఉద్దేశించి మాట్లాడుతూ సింగరేణి సహోద్యోగులకు, వారి కుటుంబ సభ్యులకు, కార్మిక నాయకులకు, పత్రిక, మీడియా ప్రతినిదులకు మరియు ఇక్కడికి విచ్చేసిన వివిద పాటశాలల ఆద్యాపకులకు మరియు వారి విద్యార్ధులకు 76వ గణతంత్ర దినోత్సవ శుభాకాంక్షలు.



భారత రాజ్యంగా నిర్మాత డాక్టర్ బి. ఆర్ అంబేద్కర్ సారధ్యంలో భారత రాజ్యాంగాన్ని రూపొందించుకొని సర్వ సత్తాక సామ్యవాద, లౌకిక, ప్రజాస్వామిక గణతంత్ర దేశముగా భారత దేశము అవతరించింది. స్వపరిపాలన లక్ష్యం తో సాధించుకొన్న గణతంత్ర రాజ్యాన్ని పరిరక్షించుకొనుట మనందరి భాద్యత ఈ సందర్భాన్ని పురస్కరించుకొని దేశం నలుమూలల 76వ గణతంత్ర దినోత్సవ వేడుకలను ఎంతో ఘనంగా నిర్వహించుకోనుటం జరుగుతున్నది. మన దేశం ఏటేట అన్ని రంగాలలో అభివృద్ధి చెందుతూ తన ప్రతిభను మరింత మెరుగుపరుచుకుంటూ అగ్ర దేశాల సరసన నిలిచింది అనటంలో ఎటువంటి సందేహం లేదు. ప్రపంచంలోనే అతిపెద్ద ఆర్ధిక శక్తుల సరసన నిలిచింది. డిమాండ్ కి తగిన విధంగా ఇందన అవసరాలను తీరుస్తూ విద్యుత్తుతో పాటు మరిన్ని అనుబంద సంస్థలకు అవకాశాలను కల్పిస్తున్న సంస్థ మన బొగ్గు పరిశ్రమ. 138 సంవత్సరాల చరిత్ర కలిగిన మన సింగరేణి సంస్థ దక్షిణ భారత దేశం లోని ఇందన అవసరాలను తీరుస్తున్న అతి పెద్ద బొగ్గు పరిశ్రమ. బొగ్గు ఉత్పత్తి లోనే కాకుండా పవర్ ఉత్పాదనలో కూడా మన సంస్థ ముందుకు సాగుతున్నందుకు సంతోషముగా ఉన్నది. అన్ని ఏరియాలలో సోలార్ ప్లాంట్లను వేగవంతముగా నిర్మాణం చేపట్టటం జరుగుతుంది. సంస్థ అభివృద్ధికి ఉత్పత్తి వ్యయాన్ని తగ్గించుకొని, నాణ్యమైన బొగ్గును ఉత్పత్తి చేస్తూ వినియోగుదరులకు అందించేందుకు గాను ప్రతి ఒక్కరు తమ విధులను రక్షణతో సమర్ధవంతంగా, సక్రమంగా, నిజాయితీతో నిర్వహిస్తూ సంస్థ అభివృద్ధికి కృషి చేయవలసి ఉన్నదని ఈ సందర్భంగా తెలియజేస్తున్నాను. 2024-25 సంవత్సరానికి కొత్తగూడెం ఏరియాకి నిర్దేశించిన లక్ష్యం 149.50%ూు% గాను నేటి వరకు (24.01.2025) 113.30%ూు% గాను 98% శాతంతో 111.18%ూు%లు ఉత్పత్తి సాదించటం జరిగినది. కొత్తగూడెం ఏరియా విస్తరణలో భాగముగా మరియు జికేఓసి మూసివేస్తున్నందున ప్రస్తుతము ఉన్న వికే-7 భూగర్భ గనిని వికే ఓపన్ కాస్ట్ ప్రారంభించడం జరుగుతుంది.

ఈ ఆర్ధిక సంవత్సరంలో తేదీ:24.01.2025 వరకు 129.82లక్షల టన్నులు బొగ్గును రవాణా చేయటం జరిగింది. రైలు మార్గం ద్వారా తేదీ: 25.01.2025 వరకు 117.24లక్షల టన్నులను 2924 రేకుల ద్వారా ఆర్సిహెచ్పి మరియు జేవిఆర్ సిహెచ్పి నుండి బొగ్గు రవాణా చేయటం జరిగింది. మరియు రోడ్డు మార్గంలో 12.57 లక్షల టన్నుల బొగ్గు రవాణా చేయటం జరిగింది.

కొత్తగూడెం ఏరియాలో 37 %వీఔ% సోలార్ ప్లాంట్ ను నిర్మించటం జరిగింది. : 24.01.2025 వరకు 187.04 మిలియన్ యూనిట్ ల సోలార్ విద్యుత్ ను ఉత్పతి చేయటం జరిగింది. అలాగే 10.5 %వీఔ% సోలార్ ప్లాంట్ తేదీ. 24.01.2025 వరకు 13.66 మిలియన్ యూనిట్ మరియు విప్తుత్తులో 22.5 %వీఔ% సోలార్ ప్లాంట్ ల నిర్మాణ పనులు జరుగుతున్నాయి. ఈ పనులు మే.2025 లోపు పూర్తి కానున్నవి.

2023-2024 ఆర్ధిక సంవత్సరానికి కొత్తగూడెం ఏరియా నుండి సి.ఎస్.ఆర్ బడ్జెట్ 4.41 కోట్లకు గాను 1.66 కోట్లలను ఇప్పటివరకు వినియోగించటం జరిగింది. మిగిలిన బడ్జెట్ 2.75 కోట్ల పనులు ఇంకా జరుగుతున్నవి మరియు జరగాల్సినవి ఉన్నవి.

కొత్తగూడెం ఏరియాలో 3 ఇంక్లైన్ బంగ్లాస్ వద్ద 83 ఆఫీసర్ క్వార్టర్ లను, మైన్స్ రెస్క్యూ స్టేషన్ వద్ద 60 %వీజ% - టైప్ క్వార్టర్ లను, రుద్రంపూర్ ఏరియాలో 210 - %వీణ% టైప్ క్వార్టర్ లను మరియు సత్తుపల్లి నందు 81 ఆఫీసర్ క్వార్టర్ లను సుమారు 174.5 కోట్ల రూపాయల వ్యయంతో నిర్మాణ పనులు జరుగుతున్నాయి.

2018 నుండి మెడికల్ ఇన్ వాలిడేషన్ / మరణించిన 846 మంది కార్మికుల వారసులకు కారుణ్య నియమకాలలో భాగంగా ఇప్పటివరకు 622 కార్మికుల వారసులకు ఉద్యోగాలను ఇవ్వటం జరిగింది మరియు 66 మంది కార్మికులకు లేదా వారి కుటుంబ సభ్యులకు ఏకమొత్తం %ూూా% ను 25 లక్షల చొప్పున ఇవ్వటం జరిగింది.

2018 నుండి ఇప్పటివరకు 2763 సి పి ఆర్ ఎం ఎస్ హెల్త్ కార్డ్ లకు గాను 2762 హెల్త్ కార్డ్ జారీ చేయటం జరిగింది

2024వ సంవత్సరంలో 229 గ్రాట్యుటీ క్లెయిమ్ లకు గాను 86 క్లైమ్ లను సెటిల్ చేయటం జరిగింది. మిగిన 143 క్లైమ్ లను కారుణ్య నియామకం చేపట్టిన తరువాత చెల్లించడం జరుగుతుంది.

2024వ సంవత్సరంలో 240 ఎంప్లాయ్ సి.ఎం.పి.ఎఫ్. మరియు పెన్షన్ క్లెయిమ్ లకు గాను 225 క్లైమ్ లు, 70 విడో పెన్షన్ క్లైమ్ లను సెటిల్ చేయటం జరిగింది.

2024వ సంవత్సరంలో 143 మందికి ఎస్ఎల్పి/ఎస్ఎల్ఐ ప్రమోషన్స్ మరియు టైమ్ రేటెడ్ వేకన్సి క్రింద 15 మందికి మరియు 52 మందికి క్యాడర్ స్కీమ్ క్రింద ప్రమోషన్ ఇవ్వడం జరిగింది.

2024వ సంవత్సరంలో 291 మంది ఉద్యోగులకు హెచ్ బి ఎల్ ఐ ఆర్ స్కీం లో భాగంగా కంపనీ నియమాలను అనుసరించి గృహ రుణంపై వడ్డీ మొత్తాన్ని చెల్లించటం జరిగింది.

సింగరేణి సేవా సంస్థ (%ూూా%) ద్వారా రుద్రంపూర్, గౌతమ్ పూర్, రామవరం, ధన్బాద్ మరియు సత్తుపల్లి ఏరియా లోని జలగం నగర్, పి.వి. నరసింహరావు కాలనీ, కిష్టారం ప్రాంతాలనందు టైలరింగ్, మగ్గం వర్క్, బ్యూటీషియన్, ఫ్యాషన్ డిజైనింగ్ కోర్సులలో సుమారు 270 మంది నిరుద్యోగ పరిసర ప్రాంత మహిళలు శిక్షణ పొందుతున్నారు.

అనంతరం కొత్తగూడెం ఏరియాలో వివిధ గనులలో నుండి ఉత్తమ ఉద్యోగులుగా ఎంపిక కాబడిన 06 మంది ఉద్యోగులను వారి కుటుంబ సభ్యులను సన్మానించారు. అలాగే బ్లాస్టింగ్ సెక్షన్ లో పనిచేస్తున్న వారికి రక్షణ అవగాహనపై ఏర్పాటుచేసిన వ్యాసరచన నందు ఉత్తమ వ్యాసరచన రాసిన ఉద్యోగులకు అలాగే విజిలెన్స్ అవగాహన సదస్సు నందు ఉత్తమ వ్యాసరచన రాసిన ఉద్యోగులకు ప్రశంసా పత్రాలను అందజేసినారు. తదుపరి పాటశాలల విద్యార్ధి విద్యార్ధులతో దేశ భక్తికి సంబంధించిన వివిధ సంస్కృతిక కార్యక్రమాలను ప్రదర్శించి ఆహుతులందరిని అలరించినారు. చివరిగా పాటశాలల ప్రధానోపాధ్యాలు మరియు ఈ వేడుకలను విజయాల్లో బాగస్థులైన సంభాధిత డిపార్ట్మెంట్ వారిని మెమొంటో లను బహుకరించినారు. చివరగా కే దేవదాస్, సీనియర్ పిఓ, వందన సమర్పణతో ఈ కార్యక్రమము ముగిసినది.

ఈ కార్యక్రమములో ఎం. షాలేం రాజు, జనరల్ మేనేజర్, కొత్తగూడెం ఏరియా, %ూజుఔూా% అధ్యక్షురాలు జి. మధురవాణి షాలేం రాజు, కొత్తగూడెం ఏరియా ఏఐటియుసి బ్రాంచ్ సెక్రటరీ వి.మల్లికార్జునరావు, ఐఎన్టియుసి వైస్ ప్రెసిడెంట్ ఎండి.రజాక్ కొత్తగూడెం ఏరియా అధికారుల సంఘం జనరల్ సెక్రెటరీ ఏ.ఉపేంద్ర బాబు, ఎస్.ఓ. టు జి.ఎం. జివి. కోటి రెడ్డి, ఏరియా ఇంజినీర్ కె. సూర్యనారాయణ రాజు, ఎజిఎం(సివిల్) సిహెచ్ రామకృష్ణ, ఎజిఎం(ఫైనాన్స్) కే. హనా సుమలత, పద్మావతి ఖని ఏజెంట్ బి. రవీందర్, డిజిఎం (పర్సనల్), బి. శివ కేశవ రావు, ఏరియా సేఫ్టీ ఆఫీసర్ ఎం. వేంకటేశ్వర రావు, జీకే ఓ సి ప్రాజెక్ట్ ఆఫీసర్ ఎం.శ్రీ రమేష్, పద్మావతి ఖని మేనేజర్ శ్యాం ప్రసాద్, జికేఓసి మేనేజర్ మురళి, ఏరియా సెక్యూరిటి ఆఫీసర్ వి. శ్రీనివాసరావు, ఏరియా వర్క్ షాప్ డివై ఎస్ఈ (ఈ అండ్ ఎం) లు టి.అనిల్, బి. శంకర్, సీనియర్ పి.ఓ. పర్సనల్ మజ్జి మురళి, జి సంఘమిత్ర, హరీష్ గోవర్ధన్, కే దేవదాస్, విజయ సందీప్, ఎస్టేట్స్ ఆఫీసర్ బి తౌరియా, క్వాలిటీ మేనేజర్ మదన్మోహన్, ఇన్చార్జి రెస్క్యూ అనంతరామయ్య, షకీల్, డి.కావ్య, ఇతర అధికారులు, ఉద్యోగులు మరియు పర్సనల్ డిపార్ట్మెంట్ సిబ్బంధి పాల్గొన్నారు.

## రామవరం లో ఘనంగా గణతంత్ర దినోత్సవ వేడుకలు

### ముఖ్య అతిథిగా హాజరైన మోతుకూరి ధర్మారావు





భద్రాద్రి కొత్తగూడెం,26 జనవరి (క్రాంతిన్యూస్):రామవరం లో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో లో ఏర్పాటు చేసిన గణతంత్ర వేడుకలకు ముఖ్య అతిథిగా కొత్తగూడెం సీనియర్ కాంగ్రెస్ నాయకుడు మోతుకూరి ధర్మారావు హాజరై జెండా ఎగరవేశారు. అనంతరం మాట్లాడుతూ రెండు శతాబ్దాల ఆంగ్లేయుల కబంధ హస్తాల నుండి దేశానికి ఆగస్టు 15 1947లో స్వతంత్రం సిద్ధించిందన్నారు. అనంతరం దేశానికి ప్రత్యేక రాజ్యాంగం కావాలని డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ నేతృత్వంలో రాజ్యాంగ రచన కమిటీ రెండు సంవత్సరాల 11 నెలల 18 రోజులపాటు శ్రమించి గొప్ప రాజ్యాంగాన్ని నిర్మించిందన్నారు. ఈ రాజ్యాంగాన్ని 1949 నవంబర్ 26న ఆమోదించారని గుర్తు చేశారు. ఆ తర్వాత 1950 జనవరి 26న రాజ్యాంగాన్ని అమలు చేశారని పేర్కొన్నారు. మాదిగ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన గణతంత్ర వేడుకలకు ముఖ్య అతిథిగా హాజరయ్యారు.రామవరంలో సైకిల్ మెకానిక్ చేస్తూ మేషన్ పనిముట్ల ను కిరాయి కిస్తూ జీవనం జరుపుతున్న మద్దికుంట గణేష్ కూతురు గౌతమి కష్టపడి చదివి రెండు ఉద్యోగాలు పొందిన గౌతమి గవర్నమెంట్ ఉద్యోగానికి రాజీనామా చేసి సింగరేణిలో సివిల్ డిపార్ట్మెంట్లో సబ్ ఓవర్సీల్ గా జాయిన్ అయ్యారు . కష్టపడి చదివి ఉద్యోగాన్ని పొందిన గౌతమి తండ్రి గణేష్ కు అండగా ఉండాలని ఉండాలని ఆకాంక్షిస్తూ మరిన్ని ఉన్నత ఉద్యోగాలను పొందాలని మాదిగ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించారు స్వీట్స్ ని పంపిణీ చేశారు కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా సీనియర్ కాంగ్రెస్ నాయకులు ధర్మరావు హాజరై చిరంజీవి గౌతమిని ఆశీర్వదించారు. కార్యక్రమంలో కొయ్యడ వెంకన్న ,కొత్తూరు మదినయ్య, సామర్ల సమ్మయ్య ,అవునూరి సంజీవరావు ,మాతంగి లింగయ్య ,కూరగాయల శీను, సావటి స్వామి, బరిగెల భూపేష్, కాసుల వెంకట్ , గోబ్రియ నాయక్ ,పెరిక కిరణ్, చాట్ల కృష్ణ ,ఇంటికి పెల్లి శంకర్, జంగం కృష్ణ ,కొమురయ్య, బరిగల స్వామి, టోపీ రామకృష్ణ ,మహేష్ తదితరులు పాల్గొన్నారు

## ఘనంగా గణతంత్ర దినోత్సవ వేడుకలు.

### జాతీయ పతాకాన్ని ఆవిష్కరించిన జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్.



ములుగు .,26 జనవరి (క్రాంతిన్యూస్ ):భారత గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని ములుగు జిల్లా కేంద్రంలోని తంగేడు మైదానం లో గణతంత్ర దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్.

ముఖ్య అతిథిగా విచ్చేసి త్రివర్ణ పతాకాన్ని ఆవిష్కరించారు. అనంతరం పోలీసుల నుండి గౌరవ వందనం స్వీకరించారు. వివిధ శాఖల ద్వారా జిల్లాలో అమలవుతున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు, సాధించిన ప్రగతి గురించి తన ప్రసంగం ద్వారా తెలియజేశారు. రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణ అభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, మహిళ శిశు సంక్షేమ శాఖ మంత్రి ధనసరి అనసూయ సీతక్క, ఎస్పి షభరిష్, ఓ ఎస్ డి మహేష్ బాబా గీతే, ఏ ఎస్పి శివం ఉపాధ్యాయ, అదనపు కలెక్టర్లు సి హెచ్ మహేందర్ జి, సంపత్ రావు, అదనపు ఎస్ పి సదానందం, గ్రంథాలయ సంస్థ చైర్మన్ రవి చందర్, ఆర్డీఓ వెంకటేష్,





ఆయా శాఖల జిల్లా అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

ఉత్సాహభరితంగా చిన్నారుల సాంస్కృతిక ప్రదర్శనలు.

రిపబ్లిక్ డే వేడుక సందర్భంగా చిన్నారుల సాంస్కృతిక ప్రదర్శనలు ఆహుతులను అలరింపజేశాయి. ఎదనిండా దేశభక్తి భావాన్ని నింపుకుని తమ ప్రదర్శనలతో గణతంత్ర దినోత్సవ వేడుకలకు వన్నెలద్దారు. బాలబాలికలు ఏకరూప దుస్తులు ధరించి తమ అభినయంతో అలరింపజేశారు. ఎదనిండా దేశ భక్తిని నింపుకుని, జాతీయ సమైక్యతా భావం పెంపొందేలా దేశభక్తి గేయాలు ఆలపిస్తూ నృత్య ప్రదర్శనలతో అందరి దృష్టిని ఆకర్షించారు. ఉత్తమ సేవలు అందించిన ఉద్యోగులకు మంత్రి, కలెక్టర్ ప్రశంసాపత్రాలు బహూకరించారు.

## గిరిజన జేఏసీ ఆధ్వర్యంలో ఘనంగా గణతంత్ర వేడుకలు



భద్రాద్రికొత్తగూడెం,26 జనవరి (క్రాంతిన్యూస్):కొత్తగూడెం మున్సిపాలిటీ 11వ వార్డు వనందాసు గడ్డ కేంద్రంలో ఆదివారం 76వ గణతంత్ర దినోత్సవాన్ని గిరిజన జేఏసీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ సీనియర్ నేత, మాజీ కౌన్సిలర్ గోబ్రియ నాయక్ పాల్గొని జాతీయపతాకాన్ని ఆవిష్కరించారు. అనంతరం యూత్ కాంగ్రెస్ నాయకుడు రాజ్ కుమార్ మాట్లాడారు. రెండు శతాబ్దాల ఆంగ్లేయుల కబంధ హస్తాల నుండి దేశానికి ఆగస్టు 15 1947లో స్వతంత్రం సిద్ధించిందన్నారు. అనంతరం దేశానికి ప్రత్యేక రాజ్యాంగం కావాలని డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ నేతృత్వంలో రాజ్యాంగ రచన కమిటీ రెండు సంవత్సరాల 11 నెలల 18 రోజులపాటు శ్రమించి గొప్ప రాజ్యాంగాన్ని నిర్మించిందన్నారు. ఈ రాజ్యాంగాన్ని 1949 నవంబర్ 26న ఆమోదించారని గుర్తు చేశారు. ఆ తర్వాత 1950 జనవరి 26న రాజ్యాంగాన్ని అమలు చేశారని పేర్కొన్నారు. రాజ్యాంగ స్ఫూర్తితో నేటి యువత హక్కుల కోసం పోరాడాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో 11వ వార్డు పెద్దలు బానోత్ హర్జ నాయక్, బానోత్ సామ నాయక్, బానోత్ బాలు నాయక్ , గూగులోత్ శంకర్ నాయక్, మంగ్యా, ఇస్లావత్ తులిసియా, భూక్యా కృష్ణ సేవాలాల్ సేన జిల్లా ఉపాధ్యక్షుడు బానోత్ శ్రీనివాస్ నాయక్, బానోత్ పూర్ణచందర్, గుగులోత్ భాస్కర్ నాయక్, గుగులోత్ సీతయ్య నాయక్ , అజ్మీర పూర్ణ నాయక్ , గుగులోత్ బిక్కులాల్ నాయక్ , బానోత్ మోహన్, భూక్య హరి,బానోత్ వంశీ, అంగోత్ హరి,బానోత్ కమల,బానోత్ విజయ తదితరులు పాల్గొన్నారు.

## ఉత్తమ అధికారులుగా సేవ చేసిన వారికి అరుదైనగౌరవం....!

### ఉత్తమ అధికారులుగా ఎంపీడీవో జయశ్రీ ఎమ్మార్వో హేమ సోషల్ వెల్ఫేర్ ప్రిన్సిపాల్ బిక్షపతి. మండల స్పెషల్ ఆఫీసర్ చిన్నయ్య వైసిడిఎస్ సూపర్వైజర్ జయప్రద....



చిట్యాల ,26 జనవరి (క్రాంతిన్యూస్ ):జయశంకర్ భూపాలపల్లి జిల్లా లో 76వ గణతంత్ర దినోత్సవం సందర్భంగా చిట్యాల మండల ఎంపీడీవో జయశ్రీ ఎమ్మార్వో హేమ సోషల్ వెల్ఫేర్ ప్రిన్సిపాల్ బిక్షపతి మండల స్పెషల్ ఆఫీసర్ చిన్నయ్య సూపర్వైజర్ జయప్రదకు మండలంలో వారు చేసిన సేవలు గుర్తించి బెస్ట్ అవార్డుకు ఎన్నికయ్యారు 76వ గణతంత్ర దినోత్సవ వేడుకల్లో జిల్లా కేంద్రంలో జిల్లా కలెక్టర్ భూపాలపల్లి శాసనసభ్యులు గండ్ర సత్యనారాయణ రావు చేతుల మీదుగా ఉత్తమ అవార్డులు అందజేశారు ఈ అవార్డులు స్వీకరించిన అనంతరం వారు మాట్లాడుతూఅందరి పనితీరును గుర్తించి బెస్ట్ అవార్డు ఇచ్చినందుకు జిల్లా కలెక్టర్ మరియు శాసనసభ్యులకు హృదయపూర్వక ధన్యవాదాలు తెలియజేస్తున్నామని ఇంకా ముందు ముందు ప్రభుత్వం ప్రవేశపెట్టిన అన్ని కార్యక్రమాలను ప్రజల ముందుకు తీసుకెళుతూ విజయవంతంగా విధులు నిర్వహిస్తామని ఈ అవార్డు రావడం వలన ఇంకా ఎక్కువ బాధ్యత పెరిగిందని మాకు వచ్చిన అవార్డుకు మండల పరిధిలో ఉన్న టీచర్స్ ఆయాల అందరి సహకారం మండల పరిషత్తు ఎంపీడీవో ఎమ్మార్వో అందరు సహకరించినందుకు అలాగే నేను చేస్తున్న కార్యక్రమాలు అన్ని గుర్తించి నాకు ఈ అవార్డు ప్రకటించడం చాలా సంతోషంగా ఉందని అన్నారు.

## రామవరం పార్టీ కార్యాలయం లో ఘనంగా గణతంత్ర దినోత్సవ వేడుకలు



భద్రాద్రి కొత్తగూడెం బ్యూరో,26 జనవరి (క్రాంతిన్యూస్ ): భద్రాద్రి కొత్తగూడెం రామవరం కాంగ్రెస్ పార్టీ కార్యాలయం నందు ఘనంగా గణతంత్ర దినోత్సవం జరుపుకోవడం జరిగింది ఏరియా ఉపాధ్యక్షులు ఎండి రజాక్ ముఖ్యఅతిథిగా పార్టీ కార్యాలయంలో జాతీయ పతాకాన్ని అవష్కరించారు ఆవిష్కరించారు. రజాక్ మాట్లాడుతూ జనవరి 26న 1950 సంవత్సరంలో భారతదేశ గణతంత్ర దినోత్సవం గా జరుపుకుంటున్నాము ,మరి ఈ సంవత్సరము 76వ గణతంత్ర దినోత్సవం వేడుకలు ఘనంగా జరుపుకుంటున్నాము అని, స్వతంత్రం కోసం అనేక నాయకులు తన త్యాగాలతో ఈరోజు మనము ఇంత స్వేచ్ఛగా స్వతంత్రముగా బతుకుతున్నాము అని, అంబేద్కర్ ఇచ్చిన రాజ్యాంగము లో అందరికీ సమాన హక్కులు రచించారు అని, ప్రపంచంలో అతిపెద్ద ప్రజాస్వామ్యంక దేశముగా భారత దేశం అభివృద్ధి చెందుతుంది అని అన్నారు. ఈ కార్యక్రమంలో రామవరం పట్టణ నాయకులు హరి సింగ్ సత్య రాజు, ఎస్.కె జానీ పాషా, ఎస్ కే లాల్ మొహమ్మద్ ,కే నారాయణ ,కే కళ్యాణ్, ఎస్ సారంగపాణి, పెంట రెడ్డి శీను రాహుల్ రెడ్డి ,ఎస్.కె అయూబ్ గొర్రె బాబురావు, కనక రాజు తదితరులు పాల్గొన్నారు.

## అర్హులైన వారందరికీ ప్రభుత్వ పథకాలు ప్రారంభం



హుస్నాబాద్,26జనవరి (క్రాంతిన్యూస్ ):సిద్దిపేట జిల్లా హుస్నాబాద్ మండలంలోని తోటపల్లి గ్రామంలో మరియు అక్కన్నపేట మండలం కుందన్ వానిపల్లి గ్రామంలో ప్రభుత్వ ఆదేశాల మేరకు అధికారులు కాంగ్రెస్ నాయకులు ప్రజాపాలనలో భాగంగా నాలుగు పథకాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా తోటపల్లి గ్రామంలో స్పెషల్ ఆఫీసర్ వెంకట్ రెడ్డి మాట్లాడుతూ అర్హులైన ఇందిరమ్మ ఇండ్లను, రైతు భరోసారు, అర్హులైన వారికి రేషన్ కార్డులు, భూమిలేని వ్యవసాయ కూలీలకు ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకాలను ప్రారంభించడం జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో తహసిల్దార్ రవీందర్ రెడ్డి, అనంతరెడ్డి, కాంగ్రెస్ నాయకులు బంకచందు, జంగపల్లి ఐలయ్య, ప్రభుత్వ అధికారులు కాంగ్రెస్ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## న్యూ ప్రెస్ క్లబ్ ఆధ్వర్యంలో గణతంత్ర దినోత్సవ వేడుకలు



హుస్నాబాద్,26జనవరి(క్రాంతిన్యూస్) :సిద్దిపేట జిల్లా హుస్నాబాద్ లోని న్యూ ప్రెస్ క్లబ్ ఆధ్వర్యంలో గణతంత్ర దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా న్యూ ప్రెస్ క్లబ్ డివిజన్ అధ్యక్షుడు బానోతు హనుమంతు నాయక్ జాతీయ జెండాను ఆవిష్కరించారు. అనంతరం విద్యార్థులకు నోటు పుస్తకాలు పెన్నులు స్వీట్లు పంపిణీ చేశారు. గణతంత్ర దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో జర్నలిస్టులు వంగరాజు, వరయోగుల ప్రశాంత్, ఎండి అక్రమ్, మాటూరు గోపి కాశబోయిన రవీందర్, శ్రీనివాస్, కోయ్యడ అనిల్, దిలీప్, పున్న శంకర్, పచ్చిమట్ల శివ, రవి తదితరులు పాల్గొన్నారు.


# ఆరోగ్య క్రాంతి



# ఆక్యుపంక్చర్ యొక్క ఆరోగ్య ప్రయోజనాలు

హెల్త్ న్యూస్,26 జనవరి (క్రాంతి న్యూస్ ): ఇటీవలి సంవత్సరాలలో, ఆక్యుపంక్చర్ వైద్య సంఘంలో మరియు ప్రత్యామ్నాయ చికిత్సలను కోరుకునే రోగులలో గణనీయమైన శ్రద్ధ మరియు ప్రశంసలను పొందింది. సాంప్రదాయ చైనీస్ మెడిసిన్ (TCM)లో పాతుకుపోయిన ఈ పురాతన అభ్యాసం శక్తి యొక్క ప్రవాహాన్ని సమతుల్యం చేయడానికి శరీరంలోని నిర్దిష్ట బిందువులలోకి సన్నని సూదులను చొప్పించడం లేదా Qi.

ఆక్యుపంక్చర్ నొప్పి నిర్వహణ నుండి మానసిక శ్రేయస్సు వరకు అనేక ఆరోగ్య ప్రయోజనాలను అందించగలదని పరిశోధన మరియు క్లినికల్ ప్రాక్టీస్ నిరూపించాయి. ఈ కథనం ఆక్యుపంక్చర్ యొక్క విభిన్న ఆరోగ్య ప్రయోజనాలను పరిశోధిస్తుంది మరియు వివిధ పరిస్థితులలో దాని సమర్థతపై అంతర్దృష్టులను అందిస్తుంది.



### జీర్ణ ఆరోగ్యానికి ఆక్యుపంక్చర్

జీర్ణ ఆరోగ్యం అనేది మొత్తం శ్రేయస్సుకు మూలస్తంభం, మరియు ఆక్యుపంక్చర్ వివిధ జీర్ణశయాంతర పరిస్థితులను గణనీయంగా మెరుగుపరుస్తుందని చూపబడింది. నిర్దిష్ట ఆక్యుపంక్చర్ పాయింట్లను ప్రేరేపించడం ద్వారా, ఈ చికిత్స గట్ చలనశీలతను పెంచుతుంది, వాపును తగ్గిస్తుంది మరియు జీర్ణవ్యవస్థను సమతుల్యం చేస్తుంది.

### మెకానిజమ్స్ మరియు ప్రయోజనాలు

అటానమిక్ నాడీ వ్యవస్థను నియంత్రించడం మరియు జీర్ణ ఎంజైమ్‌ల స్రావాన్ని ప్రోత్సహించడం ద్వారా జీర్ణ ఆరోగ్యానికి ఆక్యుపంక్చర్ పనిచేస్తుంది. ప్రకోప ప్రేగు సిండ్రోమ్ (IBS) వంటి పరిస్థితులను నిర్వహించడంలో ఇది చాలా ప్రభావవంతంగా ఉంటుందని అధ్యయనాలు సూచించాయి. గ్యాస్ట్రోఎసోఫాగియల్ రిఫ్లక్స్ వ్యాధి (GERD)మరియు దీర్ఘకాలిక మలబద్ధకం. ఈ సమస్యలను తగ్గించడం ద్వారా, ఆక్యుపంక్చర్ మెరుగైన పోషకాల శోషణకు మరియు మొత్తం జీర్ణశయాంతర పనితీరుకు దోహదం చేస్తుంది.

### క్లినికల్ ఎవిడెన్స్

గ్యాస్ట్రోఎంటరాలజీ జర్నల్‌లో ప్రచురించబడిన ఒక అధ్యయనం ప్రకారం, ఆక్యుపంక్చర్ చికిత్స పొందిన రోగులు ప్రామాణిక వైద్య సంరక్షణ పొందిన వారితో పోలిస్తే IBS లక్షణాల నుండి గణనీయమైన ఉపశమనం పొందారు. అదనంగా, ఆక్యుపంక్చర్ GERD రోగులలో యాసిడ్ రిఫ్లక్స్ ఎపిసోడ్‌ల తీవ్రత మరియు ఫ్రీక్వెన్సీని తగ్గిస్తుందని చూపబడింది, ఇది ఆచరణీయమైన పరిపూరకరమైన చికిత్సగా మారుతుంది.

### మైగ్రేన్ రిలీఫ్ కోసం ఆక్యుపంక్చర్

సాంప్రదాయ ఔషధాల యొక్క పరిమిత ప్రభావం మరియు వాటి సంబంధిత దుష్ప్రభావాల కారణంగా మైగ్రేన్ బాధితులు తరచుగా ప్రత్యామ్నాయ చికిత్సలను కోరుకుంటారు. మైగ్రేన్ దాడుల యొక్క ఫ్రీక్వెన్సీ మరియు తీవ్రతను తగ్గించడానికి ఆక్యుపంక్చర్ ఒక మంచి పరిష్కారాన్ని అందిస్తుంది.

### మెకానిజమ్స్ మరియు ప్రయోజనాలు

ఆక్యుపంక్చర్ యొక్క అనాల్జేసిక్ ప్రభావాలు ఎండార్ఫిన్‌ల విడుదల మరియు కేంద్ర నాడీ వ్యవస్థలో నొప్పి మార్గాల మాడ్యులేషన్ ద్వారా మధ్యవర్తిత్వం వహించబడతాయి. ఆక్యుపంక్చర్ వాస్కులర్ సిస్టమ్‌ను స్థిరీకరించడం ద్వారా మరియు మంటను తగ్గించడం ద్వారా మైగ్రేన్‌ల ఫ్రీక్వెన్సీని తగ్గిస్తుంది.

### క్లినికల్ ఎవిడెన్స్

కోక్రాన్ డేటాబేస్ ఆఫ్ సిస్టమాటిక్ రివ్యూస్‌లో ప్రచురించబడిన మెటా-విశ్లేషణ, మైగ్రేన్ ఫ్రీక్వెన్సీని తగ్గించడంలో ప్లేసిబో కంటే ఆక్యుపంక్చర్ మరింత ప్రభావవంతంగా ఉంటుందని మరియు రోగనిరోధక ఔషధ చికిత్సతో పోల్చదగినదని వెల్లడించింది. రోగులు తక్కువ మాత్రమే నివేదించారు మ్కైగ్రేన్లు కానీ మైగ్రేన్-సంబంధిత వైకల్యంలో తగ్గింపు, జీవిత నాణ్యతలో మొత్తం మెరుగుదలను సూచిస్తుంది.

### ఆక్యుపంక్చర్‌తో నిద్రను మెరుగుపరుస్తుంది

సరైన ఆరోగ్యానికి నాణ్యమైన నిద్ర అవసరం, అయినప్పటికీ చాలా మంది వ్యక్తులు నిద్రలేమి మరియు ఇతర నిద్ర రుగ్మతలతో పోరాడుతున్నారు. నిద్ర నాణ్యత మరియు వ్యవధిని మెరుగుపరచడానికి ఆక్యుపంక్చర్ సమర్థవంతమైన చికిత్స.

### మెకానిజమ్స్ మరియు ప్రయోజనాలు

ఆక్యుపంక్చర్ సడలింపును ప్రోత్సహిస్తుంది మరియు సెరోటోనిన్ మరియు మెలటోనిన్ వంటి న్యూరోట్రాన్స్మిటర్ల ఉత్పత్తిని ప్రభావితం చేయడం ద్వారా శరీరం యొక్క సర్కాడియన్ లయలను నియంత్రిస్తుంది. నిద్ర నియంత్రణకు సంబంధించిన నిర్దిష్ట పాయింట్లను లక్ష్యంగా చేసుకోవడం ద్వారా, ఆక్యుపంక్చర్ ఉపశమనానికి సహాయపడుతుంది నిద్రలేమితో, స్లీప్ అప్నియా, మరియు రెస్ట్లెస్ లెగ్ సింద్రోమ్.

### క్లినికల్ ఎవిడెన్స్

జర్నల్ ఆఫ్ స్లీప్ రీసెర్చ్‌లో ప్రచురించబడిన ఒక అధ్యయనం ప్రకారం, ఆక్యుపంక్చర్ పొందిన పాల్గొనేవారు షామ్ ఆక్యుపంక్చర్ పొందిన వారితో పోలిస్తే నిద్ర ప్రారంభం, వ్యవధి మరియు నాణ్యతలో గణనీయమైన మెరుగుదలలను అనుభవించారు. అదనంగా, ఆక్యుపంక్చర్ తగ్గించడంలో ప్రభావవంతంగా ఉన్నట్లు కనుగొనబడింది అబ్స్ట్రక్టివ్ స్లీప్ అప్నియా యొక్క లక్షణాలు, నిద్ర సహాయంగా దాని సామర్థ్యాన్ని మరింత హైలైట్ చేస్తుంది.

### ఒత్తిడి తగ్గింపు కోసం ఆక్యుపంక్చర్

ఒత్తిడి అనేది ఆధునిక సమాజంలో సర్వసాధారణమైన సమస్య, ఇది అనేక ఆరోగ్య సమస్యలకు దోహదం చేస్తుంది. ఆక్యుపంక్చర్ ఒత్తిడి తగ్గింపు మరియు నిర్వహణ కోసం ఒక శక్తివంతమైన సాధనంగా చూపబడింది.

### మెకానిజమ్స్ మరియు ప్రయోజనాలు

ఆక్యుపంక్చర్ హైపోథాలమిక్-పిట్యూటరీ-అడ్రినల్ (HPA) యాక్సిస్‌ను మాడ్యులేట్ చేయడం ద్వారా మరియు ఎండార్ఫిన్‌ల ఉత్పత్తిని పెంచడం ద్వారా ఒత్తిడిని తగ్గిస్తుంది. ఇది ఒత్తిడికి సంబంధించిన హార్మోన్ అయిన కార్టిసాల్ స్థాయిలను కూడా తగ్గిస్తుంది, తద్వారా ప్రశాంతత మరియు శ్రేయస్సు యొక్క భావాన్ని ప్రోత్సహిస్తుంది.

### క్లినికల్ ఎవిడెన్స్

జర్నల్ ఆఫ్ ఎండోక్రినాలజీలో ప్రచురించబడిన యాదృచ్ఛిక నియంత్రిత ట్రయల్, ఆక్యుపంక్చర్ కార్టిసాల్ స్థాయిలను గణనీయంగా తగ్గించిందని మరియు పాల్గొనేవారిలో ఒత్తిడిని తట్టుకునే సామర్థ్యాన్ని మెరుగుపరిచిందని నిరూపించింది. దీర్ఘకాలిక ఒత్తిడి మరియు దాని సంబంధిత పరిస్థితులకు ఆక్యుపంక్చర్ సమర్థవంతమైన జోక్యమని అధ్యయనం నిర్ధారించింది.

### ఆందోళన మరియు డిప్రెషన్ కోసం ఆక్యుపంక్చర్

ఆందోళన మరియు వంటి మానసిక ఆరోగ్య రుగ్మతలు మాంద్యం ఒక వ్యక్తి యొక్క జీవన నాణ్యతపై తీవ్ర ప్రభావం చూపుతుంది. ఆక్యుపంక్చర్ ఈ పరిస్థితులను నిర్వహించడానికి సాంప్రదాయ చికిత్సలకు పరిపూరకరమైన విధానాన్ని అందిస్తుంది.

మెకానిజమ్స్ మరియు ప్రయోజనాలు

కోసం ఆక్యుపంక్చర్ ఆందోళన మరియు డిప్రెషన్ న్యూరోట్రాన్స్మిటర్ స్థాయిలను సమతుల్యం చేయడం ద్వారా మరియు మానసిక స్థితిని నియంత్రించే మెదడు యొక్క సహజ సామర్థ్యాన్ని పెంచడం ద్వారా పనిచేస్తుంది. ఇది సెరోటోనిన్, డోపమైన్ మరియు ఎండార్ఫిన్‌ల విడుదలను ప్రోత్సహిస్తుంది, ఇవి భావోద్వేగ శ్రేయస్సుకు కీలకం.

### క్లినికల్ ఎవిడెన్స్

జర్నల్ ఆఫ్ సైకియాట్రిక్ రీసెర్చ్‌లో ప్రచురించబడిన పరిశోధనలో ఆక్యుపంక్చర్ ఆందోళన మరియు నిరాశ లక్షణాలను తగ్గించడంలో కాగ్నిటివ్-బిహేవియరల్ థెరపీ (CBT) వలె ప్రభావవంతంగా ఉంటుందని కనుగొన్నారు. ఆక్యుపంక్చర్ పొందిన పాల్గొనేవారు మానసిక స్థితిలో గణనీయమైన మెరుగుదలలు, ఆందోళన స్థాయిలను తగ్గించడం మరియు మొత్తం మానసిక ఆరోగ్యాన్ని మెరుగుపరిచినట్లు నివేదించారు.

### ఆక్యుపంక్చర్ మరియు దీర్ఘకాలిక నొప్పి నిర్వహణ

దీర్ఘకాలిక నొప్పి అనేది ప్రపంచవ్యాప్తంగా మిలియన్ల మందిని ప్రభావితం చేసే బలహీనపరిచే పరిస్థితి. ఆక్యుపంక్చర్ దీర్ఘకాలిక నొప్పి పరిస్థితులను నిర్వహించడంలో దాని సమర్థతకు విస్తృతంగా గుర్తించబడింది కీళ్ళనొప్పులు, ఫైబ్రోమైయాల్జియా, మరియు నడుము నొప్పి.

### మెకానిజమ్స్ మరియు ప్రయోజనాలు

ఆక్యుపంక్చర్ యొక్క అనాల్జేసిక్ ప్రభావాలు ఎండోజెనస్ ఓపియాయిడ్ల విడుదల మరియు నొప్పి సంకేత మార్గాల మాడ్యులేషన్ ద్వారా సాధించబడతాయి. ఆక్యుపంక్చర్ కూడా వాపును తగ్గిస్తుంది మరియు రక్త ప్రసరణను మెరుగుపరుస్తుంది, నొప్పి ఉపశమనం మరియు కణజాల వైద్యంకు దోహదం చేస్తుంది.

### క్లినికల్ ఎవిడెన్స్

జర్నల్ ఆఫ్ పెయిన్‌లో ప్రచురించబడిన ఒక సమగ్ర సమీక్ష దీర్ఘకాలిక నొప్పికి ఆక్యుపంక్చర్ సమర్థవంతమైన చికిత్స అని నిర్ధారించింది. రోగులు నొప్పి తీవ్రతలో గణనీయమైన తగ్గింపులు మరియు మెరుగైన క్రియాత్మక ఫలితాలను అనుభవించారు. నొప్పి మందులపై ఆధారపడటాన్ని తగ్గించడంలో మరియు మొత్తం జీవన నాణ్యతను పెంచడంలో ఆక్యుపంక్చర్ పాత్రను సమీక్ష హైలైట్ చేసింది.

ఆక్యుపంక్చర్ స్లిప్పర్స్ ప్రయోజనాలు

ఎంబెడెడ్ ఆక్యుప్రెషర్ పాయింట్లతో రూపొందించబడిన ఆక్యుపంక్చర్ స్లిప్పర్లు, మీ ఇంటి సౌలభ్యంతో ఆక్యుపంక్చర్ యొక్క ప్రయోజనాలను అనుభవించడానికి అందుబాటులో ఉండే మార్గాన్ని అందిస్తాయి. ఈ చెప్పులు పాదాలపై కీ ఆక్యుపంక్చర్ పాయింట్లను ప్రేరేపిస్తాయి, మొత్తం ఆరోగ్యం మరియు శ్రేయస్సును ప్రోత్సహిస్తాయి


### మెకానిజమ్స్ మరియు ప్రయోజనాలు

పాదాల అరికాళ్ళపై నిర్దిష్ట బిందువులకు ఒత్తిడిని వర్తింపజేయడం ద్వారా, ఆక్యుపంక్చర్ చెప్పులు రక్త ప్రసరణను మెరుగుపరుస్తాయి, ఒత్తిడిని తగ్గిస్తాయి మరియు నొప్పిని తగ్గించగలవు. అవి శరీరం అంతటా శక్తి ప్రవాహాన్ని మెరుగుపరుస్తాయి, మెరుగైన మొత్తం ఆరోగ్యానికి దోహదం చేస్తాయి.

### క్లినికల్ ఎవిడెన్స్

జర్నల్ ఆఫ్ ఆల్టర్నేటివ్ అండ్ కాంప్లిమెంటరీ మెడిసిన్‌లో ప్రచురించబడిన ఒక అధ్యయనం ఆక్యుపంక్చర్ స్లిప్పర్‌లను క్రమం తప్పకుండా ఉపయోగించడం వల్ల నొప్పి ఉపశమనం, ఒత్తిడి తగ్గింపు మరియు మొత్తం శారీరక శ్రేయస్సులో గణనీయమైన మెరుగుదలలు కనిపించాయి. పాల్గొనేవారు మరింత రిలాక్స్‌గా ఉన్నట్లు మరియు వారి రోజువారీ కార్యకలాపాలలో తక్కువ అసౌకర్యాన్ని అనుభవిస్తున్నట్లు నివేదించారు.

ఆక్యుపంక్చర్ నొప్పి నిర్వహణ మరియు ఒత్తిడి తగ్గింపు నుండి మెరుగైన జీర్ణ ఆరోగ్యం మరియు మానసిక శ్రేయస్సు వరకు అనేక రకాల ఆరోగ్య ప్రయోజనాలను అందిస్తుంది. మీరు దీర్ఘకాలిక నొప్పి నుండి ఉపశమనాన్ని కోరుతున్నా, మీ నిద్ర నాణ్యతను మెరుగుపరచాలని చూస్తున్నారా లేదా ఒత్తిడి మరియు ఆందోళనను తగ్గించాలనే లక్ష్యంతో ఉన్నా, ఆక్యుపంక్చర్ మీ ఆరోగ్య సంరక్షణ నియమావళికి విలువైన అదనంగా ఉంటుంది. పరిశోధన దాని సామర్థ్యాన్ని ధృవీకరించడం కొనసాగిస్తున్నందున, ఆక్యుపంక్చర్ సాంప్రదాయ చైనీస్ మెడిసిన్ యొక్క శాశ్వత జ్ఞానానికి నిదర్శనంగా నిలుస్తుంది.



# కెప్టెన్ అక్షయ్ అద్భుత బ్యాటింగ్.. హర్ష్ స్పిన్ మాయాజాలం..!

## రాజస్థాన్‌పై విదర్భ సంచలన విజయం..!



స్పోర్ట్స్ న్యూస్,26 జనవరి (క్రాంతి న్యూస్): రంజీ ట్రోఫీ ఎలైట్ గ్రూప్-బీ మ్యాచ్‌లో రాజస్థాన్‌పై విదర్భ సంచలన విజయాన్ని నమోదు చేసింది. ఆదివారం జరిగిన మ్యాచ్‌లో కెప్టెన్ అక్షయ్ వాద్కర్ అద్భుత సెంచరీ, స్పిన్నర్ హర్ష్‌దూబే బెస్ట్ బౌలింగ్‌తో 221 పరుగుల తేడాతో గెలుపొందింది. కెప్టెన్ వాద్కర్ (139), యష్ రాథోడ్ (98), ఆల్ రౌండర్ నచికేత్ భూటే (87) రెండో ఇన్నింగ్స్‌లో కీలక పాత్ర పోషించారు. విదర్భ తొమ్మిది వికెట్లకు 428 పరుగుల వద్ద ఇన్నింగ్స్‌ను డిక్లేర్ చేసింది. ఎడమచేతి వాటం స్పిన్నర్ దూబే 19 ఓవర్లు వేసి 51 పరుగులు ఇచ్చి ఐదు వికెట్లు పడగొట్టాడు. ఈ మ్యాచ్‌లో మొత్త 10 వికెట్లు తీశాడు. ఈ విజయంతో విదర్భ ఆరు పాయింట్లు సాధించి.. పాయింట్ల పట్టికలో అగ్రస్థానానికి చేరుకుంది. ఇక ఈ మ్యాచ్‌లో తొలి ఇన్నింగ్స్‌లో 165 పరుగులకే ఆల్ అవుట్ అయ్యింది. రాజస్థాన్ తొలి ఇన్నింగ్స్‌లో 265 పరుగులు చేసింది. దాంతో విదర్భ వంద పరుగుల వెనుకంజలో నిలిచింది. ఇక రెండో ఇన్నింగ్స్‌లో క్లిష్ట పరిస్థితిలో కెప్టెన్ అక్షయ్ వాద్కర్.. రాథోడ్‌తో కలిసి 94 పరుగుల కీలకమైన భాగస్వామ్యాన్ని నెలకొల్పాడు. రాథోడ్ తృటిలో సెంచరీ సాధించే అవకాశం కోల్పోయాడు. వాద్కర్, భూటేల 172 పరుగుల భాగస్వామ్యం నమోదు చేయడంతో విదర్భ మ్యాచ్‌పై పట్టు సాధించింది. ఉదయం 7 వికెట్లకు 358 పరుగుల స్కోర్ చేసిన విదర్భ.. నాలుగో రోజు మరో 70 పరుగులు చేసి ఇన్నింగ్స్‌ను డిక్లేర్ చేసింది. రాజస్థాన్ 329 పరుగుల విజయ లక్ష్యం నిర్దేశించింది.

అక్షయ్ వాద్కర్ 269 బంతులు ఎదుర్కొని 14 ఫోర్లు, ఒక సిక్సర్‌తో అజేయ సెంచరీ చేశాడు. నచికేత్ బూటే ఆరు ఫోర్లు, మూడు సిక్సర్ల సహాయంతో 87 పరుగులు చేశాడు. తొలి ఇన్నింగ్స్‌లో ఐదు వికెట్లు తీసిన 22 ఏళ్ల దూబే.. రెండో ఇన్నింగ్స్‌లో మరో ఐదు వికెట్లు పడగొట్టాడు. ఆఫ్ స్పిన్నర్ అక్షయ్ వఖరే మూడు వికెట్లు పడగొట్టాడు. వీరిద్దరు కలిసి రాజస్థాన్ బ్యాటింగ్ లైనప్‌ను కూల్చడంతో రాజస్థాన్ 43.3 ఓవర్లలో ఆలౌట్ అయ్యింది. గ్రూప్-బీలోని ఇతర మ్యాచ్‌లలో ఆంధ్ర-పుదుచ్చేరి మ్యాచ్ డ్రాగా ముగియగా.. హైదరాబాద్ జట్టు ఇన్నింగ్స్ 43 పరుగుల తేడాతో హిమాచల్‌ప్రదేశ్‌ను ఓడించింది.

# మహిళల అండర్-19 వరల్డ్‌కప్‌లో భారత్ జోరు.. బంగ్లాపై ఘన విజయం



స్పోర్ట్స్ న్యూస్,26 జనవరి (క్రాంతి న్యూస్): మహిళల అండర్-19 టీ20 ప్రపంచకప్‌లో డిఫెండింగ్ ఛాంపియన్ అయిన భారత్ జోరు కొనసాగుతోంది. భారత యువ మహిళలు వరుస విజయాల పరంపర కొనసాగిస్తున్నారు. ఇప్పటికే వరుసగా మూడు మ్యాచ్‌లలో గెలిచిన భారత్.. ఆదివారం సూపర్ సిక్స్ గ్రూప్-1లో బంగ్లాదేశ్ తో జరిగిన మ్యాచ్‌లో ఘన విజయాన్ని నమోదు చేసింది. ప్రత్యర్థి బంగ్లాను 8 వికెట్ల తేడాతో మట్టి కరిపించింది. ముందుగా బ్యాటింగ్ చేసిన బంగ్లాదేశ్ జట్టును భారత్ నిర్ణీత 20 ఓవర్లలో 8 వికెట్ల నష్టానికి 64 పరుగుల వద్ద కట్టడి చేసింది. బంగ్లా బ్యాటర్‌లలో సుమైయా అక్తర్ మినహా ఎవరూ పెద్దగా రాణించలేకపోయారు. ఆ తర్వాత స్వల్ప లక్ష్య ఛేదన కోసం బ్యాటింగ్‌కు దిగిన ఇండియా కేవలం 7.1 ఓవర్లలో రెండు వికెట్లు మాత్రమే కోల్పోయి విజయాన్ని అందుకుంది. తెలుగమ్మాయి గొంగడి త్రిష 31 బంతులను ఎదుర్కొని 8 ఫోర్లతో 40 పరుగులు రాబట్టి భారత్ విజయంలో కీలకపాత్ర పోషించింది. జట్టు విజయానికి చేరువైన దశలో త్రిష ఔటయ్యింది. ఆ తర్వాత క్రీజులోకి వచ్చిన నిక్కీ ప్రసాద్ (5 నాటౌట్) విన్నింగ్ షాట్ కొట్టింది. భారత్ తదుపరి మ్యాచ్‌లో స్కాట్లాండ్‌తో తలపడనుంది. బంగ్లా బ్యాటర్‌లలో సుమైయా అక్తర్ (21 నాటౌట్) మాత్రమే టాప్ స్కోరర్‌గా నిలిచింది. భారత బౌలర్లలో వైష్ణవీ శర్మ 3 వికెట్లు, షబ్నమ్, జోషిత, త్రిష తలా ఒక వికెట్ పడగొట్టారు.

# రంజీల్లో ఎంట్రీ ఇవ్వనున్న విరాట్ కోహ్లీ..

## అభిమానులకు బంపర్ ఆఫర్ ఇచ్చిన ఢిల్లీ జిల్లా క్రికెట్ అసోసియేషన్

స్పోర్ట్స్ న్యూస్,26 జనవరి (క్రాంతి న్యూస్):టీమిండియా మాజీ కెప్టెన్ విరాట్ కోహ్లీ త్వరలో చాలా సంవత్సరాల తర్వాత మళ్లీ రంజీల్లో ఆడనున్నాడు. వరుస పరాజయాల తర్వాత బీసీసీఐ ప్రతి క్రికెటర్ దేశవాళీ క్రికెట్ ఆడాల్సిందేనని స్పష్టం చేసిన విషయం తెలిసిందే. ఇప్పటికే కెప్టెన్ రోహిత్‌తో పాటు మరికొందరు ప్లేయర్స్ రంజీల్లో పాల్గొంటున్నారు. త్వరలోనే ఢిల్లీ జట్టు రైల్వేస్‌తో చివరి మ్యాచ్ ఆడనున్నది. ఈ మ్యాచ్‌లో విరాట్ కోహ్లీ బరిలోకి దిగనున్నాడు. దాదాపు 13 సంవత్సరాల తర్వాత విరాట్ దేశవాళీ క్రికెట్ ఆడనున్నారు. చివరిసారిగా నవంబర్ 2012లో ఘజియాబాద్‌లో ఉత్తరప్రదేశ్‌తో జరిగిన మ్యాచ్ ఆడాడు. విరాట్ డొమెస్టిక్ క్రికెట్ ఆడనున్న నేపథ్యంలో ఢిల్లీ జిల్లా క్రికెట్ అసోసియేషన్ ప్రత్యేకంగా ఏర్పాటు చేస్తున్నది. స్టేడియం వద్ద భారీగా భద్రతను పెంచడంతో పాటు స్టేడియంలో దాదాపు 10వేల మంది ప్రేక్షకులకు ఆతిథ్యం ఇవ్వబోతున్నది. ఈ మేరకు డీడీసీఏ ప్రత్యేకంగా ఏర్పాట్లు చేస్తున్నది. నార్త్ ఎండ్, ఓల్డ్ క్లబ్ హౌస్‌ను అభిమానుల కోసం తెరవనున్నది. అదనపు సీటింగ్ ఏర్పాట్లు అవసరమైతే, మిగిలిన స్టాండ్స్‌ను గ్రౌండ్ ఫ్లోర్‌లో ఏర్పాటు చేస్తామని సంబంధిత వర్గాలు తెలిపాయి. అరుణ్ జైట్లీ స్టేడియం వేదికగా రైల్వేస్ జట్టును ఢిల్లీ ఢీకొట్టనున్నది. తొలి మ్యాచ్‌లో ఘోర ఓటమి పాలైన ఢిల్లీ.. ప్రస్తుతం విరాట్ కోహ్లీపైనే ఆశలు పెట్టుకున్నది. తొలి మ్యాచ్‌లో కెప్టెన్ ఆయుష్ బదోని ఒక్కడే పర్వాలేదనిపించాడు. రిషబ్ పంత్ విఫలమయ్యాడు. తాజాగా విరాట్ కోసం జట్టుతో పాటు అభిమానులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు.

ఈ మ్యాచ్‌ను అభిమానులు ఉచితంగా వీక్షించేలా చర్యలు తీసుకుంటున్నది. మ్యాచ్ టికెట్లను విక్రయించడం లేదని డీడీసీఏ




ప్రకటించింది. జనవరి 30న మ్యాచ్ జరుగనున్నది. ఆస్ట్రేలియా పర్యటనలో చివరిదైన సిడ్నీ టెస్టులో మెడనొప్పితో విరాట్ మైదానం వీడిన విషయం తెలిసిందే. తాజాగా రైల్వేస్‌తో జరిగే మ్యాచ్‌కు అందుబాటులో ఉంటానని డీడీసీఏకు ఇప్పటికే సమాచారం ఇచ్చాడు. చాలా ఏళ్ల తర్వాత విరాట్ రంజీల్లో ఢిల్లీ తరఫున బరిలోకి దిగుతుండడంతో.. మ్యాచ్ కోసం అభిమానులు ఆసక్తికరంగా ఎదురుచూస్తున్నారు. బ్యాట్‌తో పరుగుల వరద పారించి.. మళ్లీ ఫామ్‌లోకి తిరిగి వస్తాడని ఆశిస్తున్నారు.

# ఆస్ట్రేలియన్ ఓపెన్ విన్నర్ మళ్లీ సిన్నరే..

## ఫైనల్లో చిత్తుగా ఓడిన అలెగ్జాండర్

స్పోర్ట్స్ న్యూస్,26 జనవరి (క్రాంతి న్యూస్): ఆస్ట్రేలియన్ ఓపెన్ మెన్స్ సింగిల్స్ టైటిల్‌ను మళ్లీ వరల్డ్ నెంబర్ 1 ఆటగాడు జెన్నిక్ సిన్నరే దక్కించుకున్నాడు. ఆదివారం జరిగిన ఆస్ట్రేలియన్ ఓపెన్-2025 మెన్స్ సింగిల్స్ ఫైనల్‌లో ఇటలీ టెన్నిస్ దిగ్గజం సిన్నర్ జర్మనీ ఆటగాడు



అలెగ్జాండర్ జ్వెరెవ్ ను చిత్తుగా ఓడించాడు. జ్వెరెవ్ 6-3, 7-6 (7-4), 6-3 తేడాతో ఓటమి పాలయ్యాడు. ఈ ఇద్దరి మధ్య ఫైనల్ పోరు 2.42 గంటలపాటు ఆసక్తికరంగా సాగింది.
టోర్నీ ప్రారంభం నుంచి జోరు కనబర్చిన సిన్నర్.. ఫైనల్లోనూ అదే జోరు కొనసాగించాడు. రెండో సెట్‌లో మినహా సిన్నర్‌కు ఏ దశలోనూ జ్వెరెవ్ సరైన పోటీ ఇవ్వలేకపోయాడు. దాంతో సిన్నర్ మూడు సెట్లలోనే మ్యాచ్‌ను సొంతం చేసుకున్నాడు. సిన్నర్‌కు ఇది మూడో గ్రాండ్‌స్లామ్ టైటిల్. గత ఏడాది ఆస్ట్రేలియన్ ఓపెన్‌తోపాటు యూఎస్ ఓపెన్ టైటిల్‌ను కూడా సిన్నర్ తన ఖాతాలో వేసుకున్నాడు. ఈసారి కూడా ఆస్ట్రేలియన్ ఓపెన్ టైటిల్ దక్కడంతో మొత్తం టైటిళ్ల సంఖ్య 3కు చేరింది.

ఇదిలావుంటే ఈసారైనా ఆస్ట్రేలియన్ ఓపెన్ టైటిల్ నెగ్గి తొలి గ్రాండ్ స్లామ్ టైటిల్‌ను తన ఖాతాలో వేసుకోవాలని భావించిన జ్వెరెవ్ ఆశలు ఆశలుగానే మిగిలిపోయాయి. 2020లో యూఎస్ ఓపెన్‌లో, గత ఏడాది ఫ్రెంచ్ ఓపెన్‌లో కూడా సిన్నర్ ఫైనల్‌కు చేరాడు. కానీ, టైటిల్ నెగ్గడంలో విఫలమయ్యాడు. మొత్తం మూడు సార్లు ఫైనల్లోకి అడుగుపెట్టినా గ్రాండ్ స్లామ్ టైటిల్ కల మాత్రం జ్వెరెవ్‌కు అందని ద్రాక్షగానే మిగిలింది.




# మనదే ఇదంతా..
# రవితేజ 'మాస్ జాతర' గ్లింప్స్ రిలీజ్




మూవీ న్యూస్ ,26 జనవరి (క్రాంతి న్యూస్ ): మాస్ మహరాజా రవితేజ హీరోగా భాను భోగవరపు దర్శకత్వంలో తెరకెక్కుతోన్న చిత్రం 'మాస్ జాతర'. 'మనదే ఇదంతా' ట్యాగ్‌లైన్. సితార ఎంటర్‌టైన్‌మెంట్స్, ఫార్చ్యూన్ ఫోర్ సినిమాస్ బ్యానర్లపై నాగవంశీ, సాయి సౌజన్య నిర్మిస్తున్నారు. శ్రీలీల కథానాయికగా కనిపించనున్న ఈ చిత్రం మే 9న థియేటర్‌లలో సందడి చేయనుంది. నేడు రవితేజ పుట్టినరోజు. ఈ సందర్భంగా ఆయనకు చిత్రబృందం శుభాకాంక్షలు తెలుపుతూ.. 'మాస్ జాతర' అంటూ గ్లింప్స్ రిలీజ్ చేశారు. టైటిల్‌కు తగినట్లుగానే మాస్ యాక్షన్ ఎంటర్‌టైనర్‌గా ఉంది ఈ గ్లింప్స్. చాలా రోజుల తర్వాత పాత రవితేజ కనిపించబోతున్నాడని.. రవితేజ అభిమానులు కోరుకునే అన్ని అంశాలుంటాయని చిత్రబృందం తెలిపింది. ఈ చిత్రానికి భీమ్స్ సిసిరోలియో సంగీతాన్నందిస్తున్నారు.

# అఖండ 2 నుంచి ప్రగ్యా జైస్వాల్ ఎందుకు తప్పుకుంది ..?




మూవీ న్యూస్ ,26 జనవరి (క్రాంతి న్యూస్ ):ఇటీవలే డాకు మహరాజ్ సినిమాలో బాలయ్య సరసన నటించి సూపర్ హిట్ అందుకుంది ప్రగ్యా జైస్వాల్. ఇక బాలయ్య అఖండ2లో తొలుత ఆమే హీరోయిన్. అయితే అనూహ్యంగా ఈ ప్రాజెక్ట్ నుంచి తప్పుకుంది ప్రగ్యా. ఆమె ప్లేసులోకి మరో హీరోయిన్ వచ్చేసింది. ఆమె తప్పుకోడానికి రీజన ఇదేనా...? అఖండ 2లోకి కొత్త హీరోయిన్ వచ్చింది.. ఆల్రెడీ ఉన్న హీరోయిన్ వెళ్లిపోయింది. దాంతో నందమూరి అభిమానుల్లోనే కాదు బయట కామన్ ఆడియన్స్‌లో కూడా అనుమానాలు మొదలయ్యాయి. బాలయ్య హీరోగా బోయపాటి శ్రీను తెరకెక్కిస్తున్న అఖండ 2 షూటింగ్ రామోజీ ఫిలిం సిటీలో వేగంగా జరుగుతుంది. అక్కడే కొన్ని కీలకమైన సన్నివేశాలు చిత్రీకరిస్తున్నాడు దర్శకుడు బోయపాటి. ఇక మ్యాటర్ ఏంటంటే.. ఈ సినిమా నుంచి ప్రగ్యా జైస్వాల్ తప్పుకుంది. ఆమె స్థానంలోకి సంయుక్త మీనన్ వచ్చింది. ఈ మధ్యే బాలయ్యతో కలిసి ఓ గోల్డ్ యాడ్ చేసింది సంయుక్త. అలాగే ఆయనతో కలిసి ఓ షాపింగ్ మాల్ ఓపెనింగ్‌కు కూడా వచ్చింది.

బహుశా ఆ పరిచయంతోనే అఖండ 2 హీరోయిన్ రేసులో సంయుక్త ముందుంది. అయితే సంయుక్త రావడం వరకు ఓకే కానీ బాలయ్యతో ఇప్పటికే రెండు సినిమాలు చేసిన ప్రగ్యా జైస్వాల్ ఈ సినిమా నుంచి తప్పుకోవడమే అందరికీ ఆశ్చర్యం కలిగిస్తుంది. ఇప్పటికే అఖండతో పాటు మొన్నొచ్చిన డాకు మహారాజ్‌లోనూ ప్రగ్యా నటించింది. బాలయ్యతో ఈమెది బ్లాక్‌బస్టర్ జోడీ కూడా. ఇంత రిలేషన్ ఉన్నా ఎందుకు సినిమా నుంచి తప్పుకుంది అనేది అర్థం కాని విషయం చాలా మందికి. అసలు ఈమె తప్పుకుందా లేదంటే తప్పించారా అనే అనుమానాలు కూడా ఉన్నాయి. అయితే తనకు తానుగా అఖండ 2 నుంచి ప్రగ్య బయటికి వచ్చిందని తెలుస్తుంది.

సినిమాలో ఈమె 17 ఏళ్ళ అమ్మాయికి తల్లిగా నటించాల్సి ఉంది.. ఇలా చేస్తే తన ఇమేజ్ మారిపోతుందనే భయంతోనే ఈమె తప్పుకుందని తెలుస్తుంది. అఖండలో ఉన్న చిన్నపాప పెరిగి పెద్దైన తర్వాత ఆమెకు ఓ సమస్య వస్తే.. అప్పుడు మాటిచ్చి వెళ్లిపోయిన అఖండ మళ్లీ వెనక్కి వచ్చి ఆ సమస్యను ఎలా తీరుస్తాడు అనే కథతోనే అఖండ 2 వస్తుంది. అంత పెద్ద అమ్మాయికి అమ్మగా చేస్తే కెరీర్‌లో ఇబ్బందులు వస్తాయనే ప్రగ్యా ఈ సినిమా నుంచి తప్పుకుందని వార్తలొస్తున్నాయి. మరి ఆ 17 ఏళ్ళ అమ్మాయి తల్లిగా సంయుక్త మీనన్ ఎలా సెట్ అవుతుందో చూడాలిక.

# హిట్ 3 లుక్‌తో నాని థియేటర్లలోకి వచ్చే టైం ఫిక్స్

మూవీ న్యూస్ ,26 జనవరి (క్రాంతి న్యూస్ ): గతేడాది సరిపోదా శనివారం సినిమాతో ప్రేక్షకుల ముందుకొచ్చాడు నాని ఈ స్టార్ యాక్టర్ నటిస్తోన్న చిత్రాల్లో ఒకటి హిట్ ఫ్రాంఛైజీ హిట్ 3 .




ఇప్పటికే శైలేష్ కొలను దర్శకత్వంలో వచ్చిన హిట్, హిట్-2 చిత్రాలు సూపర్ హిట్‌గా నిలిచాయి. ఇక హిట్ 3 కోసం అర్జున్ సర్కార్ డ్యూటీలో చేరిపోయాడు.. అంటూ మేకర్స్ నాని పాత్రపై స్నీక్ పీక్ అందిస్తూ గ్లింప్స్ విడుదల చేశారని తెలిసిందే.

మంచు పర్వతాల మధ్య కారుతో దూసుకుపోతున్న హిట్ ఆఫీసర్‌ని ఇద్దరు పోలీస్ ఆఫీసర్లు ఛేజ్ చేస్తున్న సన్నివేశాలు హైప్ పెంచేస్తున్నాయి.

భారతదేశం, భారతీయుల అమర స్ఫూర్తికి వందనం. హిట్ టీం తరపున గణతంత్ర దినోత్సవ శుభాకాంక్షలు. హిట్ 3 2025 మే 1న ప్రపంచవ్యాప్తంగా సినిమా థియేటర్లలోకి వస్తోందని తెలియజేస్తూ కొత్త లుక్ విడుదల చేశారు. నాని గన్ పట్టుకొని సెల్యూట్ చేస్తున్న పోస్టర్ నెట్టింట వైరల్ అవుతోంది.

ఈ చిత్రాన్ని వాల్‌పోస్టర్ సినిమా, నాని హెూం బ్యానర్ యునానిమస్ ప్రొడక్షన్స్ పై ప్రశాంతి త్రిపురనేని తెరకెక్కిస్తున్నారు. ఇప్పటికే హిట్ ఆఫీసర్ అర్జున్ సర్కార్‌గా నాని సిగార్ తాగుతూ, రక్తపు చేతులతో కారు నడుపుతూ, మరోవైపు గొడ్డలితో స్టైలిష్‌గా కనిపిస్తూ సినిమాపై అంచనాలు పెంచేస్తున్నాడు నాని. ఈ చిత్రానికి మిక్కీ జె మేయర్ మ్యూజిక్, బ్యాక్‌గ్రౌండ్ స్కోర్ అందిస్తున్నాడు.



# జిమ్ సెషన్‌లో బేబి హీరోయిన్ వైష్ణవి చైతన్య..

మూవీ న్యూస్ ,26 జనవరి (క్రాంతి న్యూస్ ): బేబి సినిమాతో బాక్సాఫీస్‌ను షేక్ చేసింది వైష్ణవి చైతన్య . ఈ భామకు నెట్టింట ఫ్యాన్ ఫాలోయింగ్‌తోపాటు ఫ్యాన్ బేస్ కూడా ఎక్కువేనని ప్రత్యేకించి చెప్పనవసరం లేదు. ప్రస్తుతం బొమ్మరిల్లు భాస్కర్ డైరెక్షన్‌లో డీజే టిల్లు హీరో సిద్ధు జొన్నలగడ్డ హీరోగా నటిస్తోన్న జాక్ ప్రాజెక్టులో ఫీ మేల్ లీడ్ రోల్‌లో నటిస్తోంది.

కాగా ఈ బ్యూటీ ఇటీవలే వర్కవుట్ సెషన్‌లో పాల్గొన్నది. జిమ్‌లో ట్రైనర్ సమక్షంలో వర్కవుట్ చేస్తూ సైజ్ జీరో ఫిజిక్ కోసం చెమటలు చిందిస్తోంది. వైష్ణవి చైతన్య చిరునవ్వులు చిందిస్తూ సెల్ఫీ దిగింది. వైష్ణవి చైతన్య జిమ్ వేర్‌లో అందాలు ఆరబోస్తూ నెటిజన్లకు కంటి మీద కునుకు లేకుండా చేస్తోంది. జిమ్ సెషన్ స్టిల్స్ నెట్టింట వైరల్ అవుతున్నాయి.

ఇప్పటికే మేకర్స్ జాక్ నుంచి వైష్ణవి చైతన్య బ్లాక్ అవుట్‌ఫిట్‌లో కనిపిస్తున్న లుక్‌ను షేర్ చేశారని తెలిసిందే. ఈ మూవీలో వైష్ణవి చైతన్య ముస్లిం యువతిగా కనిపించనున్నట్టు మేకర్స్. జాక్ చిత్రాన్ని శ్రీ వెంకటేశ్వర సినీ చిత్ర బ్యానర్‌పై బీవీఎస్ఎన్ ప్రసాద్ నిర్మిస్తున్నారు. గతేడాది చివరగా లవ్ మీ సినిమాలో మెరిసిన ఈ భామ ప్రస్తుతం మరో తెలుగు సినిమాను కూడా లైన్‌లో పెట్టింది. ఈ ప్రాజెక్ట్‌కు సంబంధించిన వివరాలపై క్లారిటీ రావాల్సి ఉంది.



Printed, Published and owned by ----------------------, Printed at ----------------------, H.No. 00000000, ######, #####, 3#####, ##### #####. Telangana State,
Published from ##### #####, H.No. 000000000, ##### #####, ##### #####, ##### ##### ##### #####. ##### #####, Telangana State. Editor: asfghjklqwertt, RNI. No. APTEL/0000/00000, Cell: 1234567890, 0987654321 Email: sample@company.com